**విలేకరులు కావలెను**

**మనవార్త దినపత్రిక లో పనిచేయుటకు విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను

**Cell: 9247819181**
**8309605189**



# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET

MANA VAARTHA

Telangana | సంపుటి:1, సంచిక:97 | volume::1, Issue:97 | బుధవారం 05 నవంబర్ 2025 పేజీలు : 8 వెల : 3.00


## జర్మనీ పెట్టుబడులకు హాట్ స్పాట్‌గా

# అవతరించనున్న హైటెక్ సిటీ



**– గ్లోబల్ ఇన్నొవేషన్ మ్యాప్‌లో హైదరాబాద్ జర్మనీ భాగస్వామ్యం కీలకం...**

**– జర్మనీ సంస్థల పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్...**

**హైదరాబాద్,** హైదరాబాద్‌ను గ్లోబల్ ఇన్నొవేషన్ హబ్‌గా అభివృద్ధి చేసే దిశలో తెలంగాణ ప్రభుత్వం వేగం పెంచింది. జర్మనీకి చెందిన పెట్టుబడిదారులు, సంస్థలు రాష్ట్ర అభివృద్ధి యాత్రలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కోరారు. ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ రంగాల్లో జర్మనీ కంపెనీల పెట్టుబడులు రాష్ట్రానికి అవసరమైన సాంకేతిక పురోగతికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. చెన్నై జర్మనీ కాన్సులేట్ జనరల్ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సమావేశమైంది. ప్రముఖ బహుళజాతి కంపెనీ డుయిష్ బోర్సా హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ వివరాలను సీఎం కు అందజేశారు. రెండు సంవత్సరాల్లో ఈ జీసీసీ ద్వారా వెయ్యి మందికి ఉద్యోగాలు సృష్టించనున్నట్లు జర్మనీ ప్రతినిధులు వివరించారు. హైదరాబాద్‌ను జీసీసీ కోసం ఎంచుకున్నందుకు జర్మనీ బృందానికి సీఎం ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పరిశ్రమలకు కావలసిన వాతావరణం, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. తెలంగాణ విద్యార్థులకు జర్మన్ భాషా శిక్షణ అందించేందుకు జర్మన్ టీచర్లను హైదరాబాద్‌లో నియమించే అవకాశాన్ని పరిశీలించాలని సీఎం కోరారు. విదేశాల్లో ఉపాధి అవకాశాల కోసం TOMCOM ద్వారా నైపుణ్యాభివృద్ధి, వృత్తిపరమైన శిక్షణ, స్కిల్ వర్క్‌లో జర్మనీ సహకరించాలని అభ్యర్థించారు. ఈ సమావేశంలో డుయిష్ బోర్సా సీఐఓ క్రిస్టోఫ్ బోమ్, జర్మనీ గౌరవ కాన్సుల్ (ఏపీ, తెలంగాణ) అమిత ఆర్ దేశాయ్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## రైతు, విద్య, ప్రాజెక్టుల సమస్యలతో మగ్గుతున్న తెలంగాణ

**–జాగృతి బాటలో కవిత ఆగ్రహ ఫైర్...**



**ఆదిలాబాద్,** తెలంగాణలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి ప్రారంభించిన "జాగృతి జనం బాట" కార్యక్రమం ఆదిలాబాద్ జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేశారు. "సామాజిక తెలంగాణ సాధన మా లక్ష్యం. మా అజెండాను నచ్చిన వాళ్లూ, నచ్చని వాళ్లూ స్వాగతం" అని కవిత స్పష్టం చేశారు. రైతుల సమస్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన కవిత, పత్తి రైతుల దుస్థితి చూసి మనసు కలచుకుపోయిందని చెప్పారు. మొంథా తుపాను ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా, ప్రజా ప్రతినిధులు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. తేమ శాతం పేరుతో రైతులను దోచుకోవద్దని హెచ్చరిస్తూ, కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకునేలా ఒత్తిడి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. "రైతును విస్మరించే రాజ్యం ఎప్పుడూ బాగుండదు" అని కవిత వ్యాఖ్యానించారు. విద్యా రంగం పరిస్థితిని కవిత తీవ్రమైన పదజాలంలో విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలలు బంద్ చేస్తున్నాయని, విద్యార్థుల భవిష్యత్తు పణంగా పెడుతున్న ప్రభుత్వాన్ని ఆమె తీవ్రంగా విమర్శించారు. "కాంట్రాక్టర్లకు డబ్బులు ఇస్తారు కానీ పేద విద్యార్థులకు ఫీజు ఇచ్చేది లేదు. విద్య లేకుండా పేదలను నాశనం చేస్తున్నారు" అంటూ వ్యాఖ్యానించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య పరిష్కారం కోసం తన వంతు పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పలు ఉదాహరణలు చూపిస్తూ కవిత ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధులపై సీరియస్‌గా ప్రశ్నలు వేశారు. ముఖ్యంగా చనాఖా కొరటా ప్రాజెక్ట్ వ్యయం 300 కోట్ల నుంచి 2 వేల కోట్లకు ఎలా పెరిగిందో బీఆర్ఎస్ వివరించాలని డిమాండ్ చేశారు. ఇంకా 10 పనులు పూర్తయితే 50 వేల ఎకరాలకు నీళ్లు అందుతాయని, మహారాష్ట్రతో సమన్వయం చేసి ప్రాజెక్ట్ పూర్తి చేయాలని కోరారు. అలాగే ఐటీ టవర్, రైల్వే బ్రిడ్జిలు, వెల్ఫేర్ స్కూల్, టూరిజం అభివృద్ధి, ఎయిర్‌పోర్ట్ భూమి వివాదం తదితర సమస్యలను ఒకదాని వెంట ఒకటి లిస్ట్ చేశారు. "జాగృతి బలోపేతం చేసి ప్రజల సమస్యలు తీర్చేలా పోరాటం చేస్తాం. భవిష్యత్‌లో ఏమి జరుగుతుందో ఇప్పుడే చెప్పలేను నాలుగు నెలలు ప్రజల మధ్య గడిపిన తర్వాతే నిర్ణయం" అని కవిత వ్యాఖ్యానించారు. జనం బాట ఫిబ్రవరి 13 వరకు కొనసాగుతుందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కదిలే వరకు జాగృతి వాయిస్ వినిపిస్తూనే ఉంటుందన్నారు.

## వికారాబాద్‌లో బస్సు ప్రమాదం

# సిమెంట్ లారీని ఢీకొన్న కర్ణాటక బస్సు



**వికారాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో వరుసగా బస్సు ప్రమాదాలు చోటుచేసుకుంటూ ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో, మరో ఘటన వికారాబాద్ జిల్లాలోని టాండూరు వద్ద నమోదైంది. కర్ణాటకానికి చెందిన ఆర్టీసీ బస్సు సిమెంట్ లారీని ఢీకొట్టిన ఈ ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. కర్ణాటకలోని కలబురిగి నుంచి టాండూరు వైపు ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు, టాండూరు సమీపంలో ఎదురు దిశ నుంచి వస్తున్న సిమెంట్ లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒక ప్రయాణికుడి తలకు గాయం కాగా, బస్సు డ్రైవర్, కండక్టర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదంతో రహదారిపై కొద్ది సేపటి పాటు రాకపోకలు అంతరాయం ఏర్పడ్డాయి. ఇటీవలి కాలంలో కర్నూలు, చేవెళ్ల ప్రాంతాల్లో బస్సు ప్రమాదాలు సంభవించిన నేపథ్యంలో, వికారాబాద్ ఘటన స్థానికుల్లో ఆందోళన పెంచింది. రోడ్డు భద్రతపై అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

## చేవెళ్ల బస్సు ప్రమాదంపై స్పందించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్



**హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల మండలం మీర్జాగూడ గేటు వద్ద జరిగిన భయానక బస్సు ప్రమాదంపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసి చర్యలు ప్రారంభించింది. ఈ ఘటనలో 19 మంది దుర్మరణం చెందగా, పలువురికి తీవ్ర గాయాలు అయిన విషయం తెలిసిందే. కమిషన్ డిసెంబర్ 15వ తేదీలోపు సమగ్ర నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు రవాణా శాఖ, హోంశాఖ, భూగర్భ గనుల శాఖ ప్రధాన కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. అలాగే జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎండీలకు కూడా నివేదికను పంపాలని కమిషన్ ఆదేశించింది. ప్రమాద సమయంలో టిప్పర్‌లో ఉండిన కంకర బస్సుపై పడటమే అధిక ప్రాణనష్టం కు కారణమైందని ప్రాథమిక సమాచారం. ఈ ఘటన మళ్లీ రోడ్డు భద్రత, రవాణా తనిఖీల వ్యవస్థ, హెవీ వాహనాల నియంత్రణపై కీలక ప్రశ్నలు లేవనెత్తింది.

## సర్దార్ @150 యూనిటీ మార్చ్‌పై హైదరాబాద్‌లో డా. కే.లక్ష్మణ్ ప్రెస్ మీట్

**హైదరాబాద్,** సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా చేపట్టిన "యూనిటీ మార్చ్ - Sardar@150" కార్యక్రమంపై హైదరాబాద్‌లోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో




కార్యాలయంలో బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే. లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. దేశ ఐక్యత, సమగ్రతకు ప్రతీకగా నిలిచిన సర్దార్ పటేల్ సేవలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్దార్ వల్లభభాయ్ పటేల్ నాయకత్వం, దూరదృష్టి, దేశ సమైక్యత కోసం చేసిన మహోన్నత కృషి ఈ తరం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రాజ్యాల సమాఖ్యను ఒక తాటి కిందకు తెచ్చిన "ఇనుప మనిషి" సేవలను జాతీయ స్థాయిలో గుర్తిస్తూ 150వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. యూనిటీ మార్చ్ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా ఐక్యత, జాతీయతా భావనను మరింత బలపరచాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని డాక్టర్ లక్ష్మణ్ చెప్పారు. పటేల్ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లేలా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, యువతకు ప్రేరణనిచ్చే సెమినార్లు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. "దేశ నిర్మాణంలో సర్దార్ పటేల్ చూపిన మార్గం ఎప్పటికీ అమరమైనది. ఆయన భావాలను కొత్తతరం హృదయాల్లో నాటడానికి యూనిటీ మార్చ్ ఒక ప్రేరణ స్థూపం" అని డా. లక్ష్మణ్ పేర్కొన్నారు.

## ఆరోగ్య శాఖలో ముగ్గురు అధికారులకు

# జాయింట్ డైరెక్టర్ పదోన్నతి

**(హైదరాబాద్,** తెలంగాణ ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖలో ముగ్గురు డిప్యూటీ డైరెక్టర్లకు తాత్కాలికంగా జాయింట్ డైరెక్టర్ హోదాకు పదోన్నతులు




మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నవంబర్ 3 తేదీన విడుదల చేసిన ప్రభుత్వ ఆదేశాల ప్రకారం డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ సిఫారసుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పదోన్నతి జాబితాలో ఎన్కృష్ణవేణి, శ్వేతా మోంగా, బి.మంజునాథ్ నాయక్ పేర్లు ఉన్నాయి. వీరిలో కృష్ణ వేణిని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో, శ్వేతా మోంగాను మహిళా ఆరోగ్య సేవల నియామక బోర్డు కార్యాలయంలో, మంజునాథ్ నాయక్‌ను జాతీయ ఆరోగ్య మిషన్‌లో పోస్టింగ్ చేయాలని ఉత్తర్వులు పేర్కొన్నాయి. పదోన్నతులు తాత్కాలికమైనవని, న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లు, అప్పీలు, తీర్పుల ఫలితాలపై ఆధారపడి ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. పదోన్నతి ఉత్తర్వులు అందిన తేదీ నుంచి పదిహేను రోజుల్లోగా కొత్త పదవిలో బాధ్యతలు స్వీకరించకపోతే, ఆ అధికారి పదోన్నతి హక్కు స్వయంచాలకంగా రద్దయ్యే అవకాశం ఉంటుందని ప్రభుత్వం తెలిపింది.

## స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు సీరియస్

# 24లోపు తేదీ ప్రకటించండి



**హైదరాబాద్,** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. పంచాయతీల పదవీకాలం పూర్తై చాలాకాలం అయినా ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్నికల నిర్వహణపై స్పష్టత ఇవ్వకపోవడం పట్ల కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే చర్యలు తీసుకోకపోతే ఎన్నికల ప్రక్రియ మరింత ఆలస్యం అవుతుందని వ్యాఖ్యానించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243E ప్రకారం పంచాయతీల కాలపరిమితి ముగిసిన ఆరు నెలల లోపే ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హైకోర్టు గుర్తుచేసింది. ఈ నిబంధనను ఉల్లంఘించడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్థానిక సంస్థలు కీలకమని, వాటిని నిలువరించే ప్రవర్తన అసహనీయమని పేర్కొంది. ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత కోరుతూ జరిగిన విచారణలో ఎన్నికల కమిషన్ తమ వాదనలు వినిపించింది. రిజర్వేషన్ల సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం, ఎస్ఈసీ సమగ్ర ప్రణాళికతో ముందుకు రావాలని సూచించింది. అన్ని గ్రామాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే విధానమే సముచితమని కోర్టు అభిప్రాయపడింది. చివరగా, హైకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ ఈ నెల 24వ తేదీ లోపు స్థానిక సంస్థల ఎన్నికల తేదీ ప్రకటించాల్సిందే అని ఆదేశించింది. ఇకపై ఆలస్యం ఏ మాత్రం సహించబోమని, ప్రభుత్వం రాజ్యాంగపరమైన బాధ్యతను నిర్వర్తించాలని కోర్టు తేల్చి చెప్పింది. ఈ ఆదేశాలతో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల చర్చ మళ్లీ హీట్ అయ్యింది.

## నాలా పై అక్రమ కట్టడాలపై హైడ్రా అధికారుల కఠిన చర్యలు

**–దేవరయంజాల్‌లో కూల్చివేతలు...**

**మేడ్చల్ జిల్లా, శామీర్ పేట నవంబర్ 4 మన వార్త :** తూముకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయంజాల్ ప్రాంతంలో హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాలపై కూల్చివేతలు చేపట్టారు. వర్షం



పడినప్పుడల్లా చెరువు నీరు, డ్రైనేజ్ నీరు ప్రవహించే సహజ కాల్వలను మూసివేయడంతో స్థానిక కాలనీలు తరచూ నీటమునుగుతున్నాయి. దీనిపై బాధితులు పలుమార్లు హైడ్రా అధికారులకు ఫిర్యాదులు చేశారు. స్థానికుల వివరాల ప్రకారం,దేవరయంజాల్‌లో కొంతమంది వ్యక్తులు నాలా మీద ప్రహరీ గోడ నిర్మించి ఆక్రమించారు. దీని వల్ల వర్షాల సమయంలో నీటి ప్రవాహం అడ్డంకి చెంది, సమీప కాలనీలు నీటమునుగుతున్నాయి. స్థానికుల ఆవేదన మేరకు హైడ్రా బృందం పరిశీలన నిర్వహించి, నాలా పై నిర్మించిన ప్రహరీ గోడలను కూల్చివేసింది. అధికారుల చర్యతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.వర్షం పడినప్పుడల్లా మేము నీటిలోనే ఉండేవాళ్లం. ఇప్పుడు ఈ కూల్చివేతల తో కొంత ఊరట లభిస్తుంది,అని బాధితులు తెలిపారు.ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు ఇలాంటి ఆక్రమణలను ఎవరైనా చేసినా కఠిన చర్యలు తీసుకోవాలి.నాలాలు,చెరువులు ప్రజల ప్రాణాలతో సంబంధమున్న సహజ వనరులు.వాటిని రక్షించడంలో అధికారులు నిర్లక్ష్యం చూపకూడదు.హైడ్రా అధికారుల హెచ్చరిక భవిష్యత్తులో నాలా చెరువు, డ్రైనేజ్ మార్గాల్లో ఎవరు ఆక్రమణలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.

## ఎఫ్ టి ఎల్ ప్రాంతంలో అక్రమ కట్టడం,వర్షాల్లో నీటమునిగే ప్రమాదం

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నవంబర్ 4 మన వార్త:** అల్వాల్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని 133 మచ్చ బొల్లారం డివిజన్లో మరో అక్రమ కట్టడం వెలుగుచూసింది. కౌకూర్ సురభి ఎంక్లేవ్ లో జిహెచ్ఎంసి పార్కు ఆనుకుని, చెరువు ఎఫ్ టి ఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్) పరిధిలో ఉన్న భూభాగంలో భారీ కాంక్రీట్



నిర్మాణం కొనసాగుతోంది.ఈ ప్రదేశం అంచున డ్రైనేజ్ కాల్వ కూడా ఇక్కడగానే ప్రవహిస్తోంది. ప్రతి వర్షాకాలంలో సురభి ఎంక్లేవ్ కాలనీ మొత్తం నీటితో నిండిపోతూ, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గత వర్షాల్లో కూడా నీరు ఇళ్లలోకి ప్రవేశించి, డ్రైనేజ్ వెనక్కి తిరిగిన సంఘటనలు నమోదయ్యాయి.ఇలాంటి పరిస్థితుల్లో అదే ప్రదేశంలో కొత్తగా నిర్మాణం కొనసాగుతుండటంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.స్థానికులు ప్రశ్నిస్తూ డ్రైనేజ్ కాల్వ ఉన్న ప్రదేశంలో, చెరువు ఎఫ్ టి ఎల్,లో ఇలా పెద్ద కట్టడం ఎలా కడుతున్నారు? జిహెచ్ఎంసి అధికారులు ఎక్కడున్నారు? ఇలాంటి అక్రమాలకు పర్మిషన్ ఇస్తారా? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం, చెరువు పరిధిలో (ఎఫ్ టి ఎల్ ఏరియా) ఏ విధమైన నిర్మాణాలు జరపడం చట్టవిరుద్ధం. అయినప్పటికీ, ఇక్కడ స్పష్టంగా నిర్మాణం కొనసాగుతుండటంతో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.ఎఫ్ టి ఎల్ ప్రాంతాల్లో నిర్మాణాలు చెరువుల సహజ ప్రవాహాన్ని అడ్డుకుంటాయి. ఇవి భవిష్యత్తులో వరద ప్రమాదాలకు దారితీస్తాయి. ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపి నిర్మాణాన్ని ఆపాలి అని సూచించారు.ప్రజల డిమాండ్ ఎఫ్ టి ఎల్ పరిధిలో జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణంపై హైడ్రా అధికారులు, జిహెచ్ఎంసి మరియు ఇరిగేషన్ (హెచ్‌డీఆర్ఏ) అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. ఇలాంటి కట్టడాలపై కఠిన చర్యలు చేపట్టాలి అని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

## మాజీ మంత్రి హరీష్ రావును పరామర్శించిన బి ఆర్ ఎస్ నాయకులు




**గజ్వేల్ నవంబర్ 04 మన వార్త ప్రతినిధి** మాజీ మంత్రి హరీష్ రావు తండ్రి సత్యనారాయణ ఇటీవల పరమపదించిన నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్ లో మాజీ మంత్రి హరీష్ రావు స్వగృహంలో వారిని పరామర్శించి కీర్తిశేషులు సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించిన మర్కుక్ మండల తాజా మాజీ ఎంపీపీ తాండ పాండు గౌడ్, మాజీ జడ్పీటీసీ రామచంద్రం ,మాజీ వైస్ ఎంపీపీ మంద బాలరెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్,నరసన్నపేట గ్రామ తాజా మాజీ సర్పంచ్ మాధవి రాజిరెడ్డి, రాంరెడ్డి,వెంకటేష్, మల్లేష్ యాదవ్ తదితరులు ఉన్నారు

## ప్రజ్ఞాపూర్ బస్టాండ్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ బ్లాక్ కావడంతో అవస్థలు



**గజ్వేల్ నవంబర్ 04 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ బస్టాండ్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ బ్లాక్ కావడంతో ప్రజ్ఞాపూర్ నుండి జగదేవపూర్ రోడ్డు వెళ్లే మెయిన్ రోడ్డులో అలాగే సెయింట్ మేరీ విద్యానికేతన్ హై స్కూల్ పరిసరాల్లో మురుగునీరు ప్రవహిస్తూ ఇటు ప్రజలకు మరియు విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నది ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ప్రజ్ఞాపూర్ బస్టాండ్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ మరమ్మతు చేయాలని, అందులోనికి వెళ్ళవలసిన మురుగునీరు సెయింట్ మేరీస్ హై స్కూల్ నుండి గృహ సముదాయల మధ్య నుండి ప్రవహిస్తూ తీవ్ర దుర్గంధం వెదజల్లుతూ ఇటు ప్రజలకు మరియు పాఠశాల విద్యార్థులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తుందని, వర్షాకాలం మరింత ఇబ్బందిగా మారిందని, వెంటనే ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు

## మాజీ మంత్రి హరీష్ రావును పరామర్శించిన గజ్వేల్ బి ఆర్ ఎస్ నాయకులు



**గజ్వేల్ నవంబర్ 04 మన వార్త ప్రతినిధి** మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తండ్రి శ్రీ సత్యనారాయణ రావు పరమపదించిన నేపథ్యంలో సోమవారం హరీష్ రావు స్వగృహంలో కీర్తి శేషులు సత్యనారాయణ రావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, అనంతరం హరీష్ రావును పరామర్శించిన గజ్వేల్ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బెండే మధు, వారితో పాటు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తాటకొండ మధుసూదన్ రెడ్డి, గొడుగు స్వామి ,కొండాపూర్ ఆంజనేలు, చెబర్తి సురేష్ చారి ,గున్నల కిష్టారెడ్డి,మైసరి దిలీప్ కుమార్ బెండే ఆదర్శ్ తదితరులు ఉన్నారు..

## మృతుల కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**–బాధిత కుటుంబాలకు మనోధైర్యాన్ని అందించారు...**

**–కాంగ్రెస్ పార్టీ వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటాము...**

**వెంకటాపూర్( రామప్ప ) నవంబర్"4 మన వార్త ప్రతినిధి** తెలంగాణా రాష్ట్ర పంచాయితీరాజ్,గ్రామీణాభివృద్ధి,స్త్రీ–శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క ఆదేశాలమేరకు,జిల్లా అధ్యక్షులు–పైడాకుల.అశోక్ సూచనలమేరకు,,వెంకటాపూర్(రామప్ప)మండలంలోని కేశవాపూర్ గ్రామ వాస్తవ్యులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు–MD.కబీర్ కోడలు గుండెపోటుతో హఠాత్మరణం చెందగా,వారి మృతదేహానికి నివాళులు అర్పించి,వారి కుటుంబాన్ని పరామర్శించి,ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా,,జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు–శ్యామ్ సుందర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు–బైరెడ్డి.భగవాన్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్–రేగా.కల్యాణి,మండల వర్కింగ్ ప్రెసిడెంట్–బండి.శ్రీనివాస్,బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దొంతరవేని.కుమార్,ములుగు మండల అధ్యక్షులు–చాంద్ పాషా,జిల్లా BC సెల్ ప్రధాన కార్యదర్శి–పచ్చిమట్ల.రాంబాబు,గ్రామ కమిటీ అధ్యక్షులు–తోట.భద్రయ్య,యూత్ జిల్లా కోశాధికారి–ఆకుతోట.అన్వేష్,మాజీ MPP–బుర్ర.సమ్మయ్య మరియు జిల్లా సీనియర్ నాయకులు,యువజన నాయకులు,మహిళా సోదరీమణులు తదితర నాయకులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లిలో చికెన్ సెంటర్ యాజమానులతో అవగాహన సదస్సు




**కోరుట్ల, నవంబర్ 04 ( మన వార్త ప్రతినిధి ) :** మెట్‌పల్లి పట్టణ మున్సిపల్ కమిషనర్ టీ. మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చికెన్ సెంటర్ యాజమానులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చికెన్ వ్యర్థాలను (వేస్ట్) అనధికారిక ప్రదేశాల్లో పారేయకుండా, మున్సిపల్ వేస్ట్ కలెక్షన్ బండికి అప్పగించాల్సిందిగా సూచించారు. చికెన్ వేస్ట్‌ను బహిరంగ ప్రదేశాల్లో పారేయడం వలన కుక్కల సంఖ్య అధికమవడంతో పాటు, పట్టణ ప్రజా ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతుందని కమిషనర్ తెలిపారు. ఇకపై ఇలాంటి వ్యవహారాలు గనక కొనసాగితే జరిమానాలు విధించబడతాయని ఆయన హెచ్చరించారు. అదేవిధంగా ప్రతి చికెన్ సెంటర్ యాజమాని తమ దుకాణానికి లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

## జూబ్లీహిల్స్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి



**గజ్వేల్ నవంబర్ 04 మన వార్త ప్రతినిధి** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు కోసం జూబ్లీహిల్స్ లోని రాజీవ్ నగర్ వివిధ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ కారు గుర్తుకే ఓటు వేసి మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేసిన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ రాజమౌళి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగిందని, జూబ్లీహిల్స్ లో ఓటర్లు బిఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని, కాంగ్రెస్ బిజెపి పార్టీకి ప్రజల్లో వ్యతిరేకత ఉందని గతంలో బిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత రెండు సంవత్సరాలలో జూబ్లీహిల్స్ లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని కచ్చితంగా బిఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని అన్నారు, ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్స్ రహీం, బొగ్గుల చందు, అర్చన శివకుమార్,బి ఆర్ ఎస్ యువ నాయకుడు సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్,బి ఆర్ ఎస్ నాయకులు, ఆరిఫ్,వెంకటేష్, నవాజ్,మర్రి స్వామి, తదితరులు పాల్గొన్నారు

## సీసీ కొనుగోలు కేంద్రాల వల్ల రైతులకు ఉపయోగం లేదు

**–మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు...**

**–ఎకరానికి 7 క్వింటాలు సీలింగ్ విధానాన్ని ఎత్తివేయాలి...**



**మధిర,నవంబర్ 4(మనవార్త):** సీసీఐ నిబంధనలతొ పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నారని నిబంధనలు మార్చాలని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్చార్జ్ లింగాల కమల్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం మండల పరిధి మాటూరు మంజిత్ కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని లింగాల కమల్ రాజు పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,సీసీఐ కేంద్రం ఏర్పాటుతో రైతులకు పెద్దగా ఒరిగిందేమీ లేదన్నారు.ప్రభుత్వం పత్తి రైతుకు మద్దతు ధర చెల్లించేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ)ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రోజుకో నిబంధనలు జారీ కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు.మాటూరు సీసీఐ కేంద్రంలో వారం రోజుల్లో కేవలం180 క్వింటాలు మాత్రమే కొనుగోలు చేశారన్నారు.తక్షణమే నిబంధనలు సవరించి రైతులను ఆదుకోవాలని అన్నారు.ఎకరాకు 7 క్వింటాలు మాత్రమే కొనుగోలు చేయాలనే సీలింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు.అలాగే తేమ18 శాతం వరకు కొనుగోలు చేయాలని, మాటూరు రెవెన్యూ పరిధిలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని మధిర మార్కెట్ యార్డులోకి మార్చాలని అయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తూరు నాగేశ్వరరావు,బి ఆర్ ఎస్ మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్ రెడ్డి,పట్టణ కార్యదర్శి అరిగే శ్రీనివాసరావు,చావా వేణు,వంకాయలపాటి నాగేశ్వరరావు,కటికల సత్యనారాయణ రెడ్డి,మాజీ సర్పంచ్ వీరారెడ్డి,మాజీ సర్పంచ్ మోరబోయిన ప్రసాద్,మాజీ సర్పంచ్ మేడిశెట్టి నాగేశ్వరరావు,ఆళ్ల నాగబాబు,మాజీ ఎంపీటీసీ వెంపటి నాగేశ్వరరావు, అమరవాది కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోహెడ పోలీసుల వాహన తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 09 మందికి 90,000/– రూపాయల జరిమాన



**–మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి 10వేల రూపాయల జరిమానా అమల్లోకి రావడం జరిగింది...**

**నవంబర్ 04 కోహెడ (మన వార్త ప్రతినిధి)**కోహెడ యస్.ఐ పి అభిలాష్, సిబ్బందితో కోహెడ మండలం లో వాహనాలు తనిఖీ చేయగా, 09 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా హుస్నాబాద్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ యం. రాజశేకర్ రెడ్డి వారి ముందు హాజరుపరచగా విచారణ చేసి 09 మందికి 90,000/ రూపాయల జరిమాన విధించారు.పట్టుబడ్డ వారి వివరాలు జంగాపల్లి రాహుల్ తండ్రి శ్రీనివాస్ కరీంనగర్, పొన్నం అనిల్ కుమార్ తండ్రి రాజయ్య పరివేద గ్రామం కోహెడ మండలం ఇజ్జగిరి ఐలయ్య తండ్రి చిన్న రాజయ్య నాగారం గ్రామం, కట్ట సంజీవ్ తండ్రి లచ్చయ్య గ్రామం కూరెల్ల కోహెడ మండలం, బరిగెల హరిప్రసాద్ తండ్రి మొగిలి చిన్న ముల్కనూరు గ్రామం, చిగురుమామిడి మండలం, చుక్క ఎల్లేష్ తండ్రి బాలయ్య కోహెడ గ్రామం %d% మండలం, మోతే కుమార్, తండ్రి మొగిలి మల్లాపూర్ గ్రామం తిమ్మాపూర్ మండలం, తట్ల సంపత్ తండ్రి వెంకటయ్య గౌరవెల్లి గ్రామం అక్కన్నపేట మండలం, వేముగంటి చక్రధరి తండ్రి వెంకటయ్య గోవర్ధనగిరి గ్రామం అక్కన్నపేట మండలం. ఈ సందర్భంగా కోహెడ ఎస్సై పి. అభిలాష్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడవదని, మరియు రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించే వాహనాలు నడపాలని, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

## రహదారిపై బైఠాయించిన మొక్కజొన్న రైతులు




**కోరుట్ల, నవంబర్ 04 ( మన వార్త ప్రతినిధి ) :**మల్లాపూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ముందర ప్రధాన రహదారిపై మొక్కజొన్న రైతులు రోడ్డుపై బైఠాయించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తేమశాతం చూడడం లేదని మొక్కజొన్నలు తూకం కూడ ఆలస్యంగా చేపడుతున్నారని రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారిని లావణ్య రోడ్డుపై బైఠాయించిన రైతుల వద్దకు వచ్చి తేమ శాతాన్ని పరిశీలించి 14 తేమశాతం వచ్చిన మొక్కజొన్నలు సీరియల్ ప్రకారము తూకం వేస్తారని అన్నారు. రైతులు మాత్రం 15 రోజుల కిందట తెచ్చిన మొక్కజొన్నలు కూడా కాంటలు పూర్తి చేస్తాలేరని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల నిర్వహకులు హమాలీలను తెప్పించి మొక్కజొన్నలు తూకం వేయాలన్నారు.

## జమలాపురం స్కూల్ పిల్లల, తల్లిదండ్రులు ఆవేదన



**మధిర,నవంబర్4( మనవార్త)** పాఠాలు చెప్పవలసిన పంతులు పక్షపాతం చూపిస్తుంటే వారి దగ్గర విద్య నేర్చుకునే విద్యార్థులు ఎంత గొప్ప వారవుతారో చూడాలి మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలం జమలాపురం గ్రామం. జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం లో పురుగులు కనిపించడంతో కొంతమంది విద్యార్థులు వంట మనిషికి,పాఠశాల సిబ్బందికి తెలియజేశారు. కొంతమంది ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల చాలా హీనంగా, కుల అహంకారంతో ప్రవర్తిస్తూ మీరు ఎస్సీలే కదా, మీరు దున్నపోతుల మాంసం, బర్రెల మాంసం తింటారు, పురుగులు తినలేరా?" అని దూషించారు అవమానకరంగా మాట్లాడిన ఉపాధ్యాయులు. అందరూ కలిసిమెలిసి కులమతాలకు అతీతంగా ఉన్న ప్రదేశని పాఠశాల అని, అలాంటిపాఠశాలలో కుల అంశాలను మాట్లాడటం విద్యార్థుల మనోభావాలను దెబ్బతీయడంతో పాటు, పాఠశాల వాతావరణంలో కుల వివక్షతను ప్రోత్సహించే ఉపాధ్యాయులపై తగిన చర్యలు తీసుకోవాలని,కులంతో దూషించిన ఉపాధ్యాయులు వారి కులం పిల్లలకు మాత్రమే విద్యను బోధించుకోవాలని. అంతేకానీ వేరే కులాలు దూషించకూడదని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఉపాధ్యాయులపై డిస్టిక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ తగిన చర్యలు తీసుకోవాలని జమలాపురం స్కూల్ పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేసినారు

## భూసాల పరీక్ష విశేషణ పత్రాల పంపిణీ చేసిన వ్యవసాయ సహాయ సంచాలకులు రాజనారాయణ



**నార్సింగి నవంబర్ 4( మన వార్త ప్రతినిధి)**నార్సింగి మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులకు భూసార పరీక్ష విశేషణ పత్రాలను ( సాయి హెల్త్ కార్డులను) మండల కేంద్రంలో రైతు వేదికలో వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్ నారాయణ రైతులకు అందజేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయిల్ హెల్త్ కార్డుల ద్వారా నేలలో ఉన్న పోషకాల స్థితి, అలాగే సాగుచేసే పంటలకు అవసరమైన ఎరువుల పరిమాణాన్ని రైతులు సక్రమంగా తెలుసుకోవచ్చని తెలిపారు. సాయిల్ హెల్త్ కార్డ్ సూచనల ప్రకారం ఎరువులు వేసుకోవడం ద్వారా భూసారం పెంచుకోవడంతో పాటు పెట్టుబడి తగ్గించుకోవచ్చు, దిగుబడి పెంచుకోవచ్చని వివరించారు.అలాగే చౌడుగల భూములకు ఎకరానికి 200 కిలోల జిప్సమ్ వాడితే చౌడు తగ్గి నేల ఉత్పాదకత పెరుగుతుందని సూచించారు, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీ ప్రతాప్ సింగ్ ఆయిల్ పామ్ సాగు మరియు అందుబాటులో ఉన్న సబ్సిడీల వివరాలను రైతులకు తెలియజేశారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చని, ఆయిల్ పామ్ మొక్కలు మరియు డ్రిప్ సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భరత్కుమార్, విస్తరణ అధికారి విజృంబన,లివ్ పామ్ మేనేజర్ ప్రశాంత్, మంజీరా FPC చెర్మెన్ నర్సింహా రెడ్డి తోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## అంగడిపట్ హనుమాన్ దేవాలయం వద్ద పులిహోర పంపిణీ




**గజ్వేల్ నవంబర్ 04 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ అంగడిపట్ హనుమాన్ దేవాలయం వద్ద మంగళవారం ఆర్యవైశ్య యువ నాయకుడు ప్రముఖ వ్యాపారవేత్త పొద్దుటూరి విజయ్ శరణ్య దంపతుల ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్ మాజీ ఉప సర్పంచ్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ అన్నదానం మహాదానమని ప్రతి మంగళవారం దాతల సహకారంతో పులిహోర పంపిణీ చేయడం జరుగుతుందని అందులో భాగంగా పొద్దుటూరి విజయ్ శరణ్య దంపతుల సౌజన్యంతో పులిహోర పంపిణీ చేయడం జరిగిందని ప్రతి ఒక్కరూ దైవభక్తి,సేవా భావం కలిగి ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల భద్రయ్య, వెంకటేష్, కాశీనాథ్, కైలాస ప్రశాంత్,కాపర్తి సంతోష్,దుర్గం, గందే సంతోష్, తదితరులు పాల్గొన్నారు

## కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను అందజేసిన మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మదనపల్లి రోహిత్




**నిజాంపేట నవంబర్ 4( మన వార్త ప్రతినిధి)**మెదక్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి బాటలో నడిపించేందుకు తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తూ రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. నిజాంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 22 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మీ,చెక్కులను మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ చేతుల మీదుగా అందజేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా మహిళా సోదరీమణులకు 22 లక్షల రూపాయల కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను అందించామన్నారు. భవిష్యత్తులో రానున్న రోజుల్లో మెదక్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి బాటలో నడిపిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తాహసిల్దార్ రమ్యశ్రీ, ఎంపీడీవో రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, పంజా మహేందర్, పట్టణ అధ్యక్షులు కొమ్మాట బాబు, మధుసూదన్ రెడ్డి, నాగరాజు, గరుగుల శ్రీనివాస్, సుధాకర్,బన్నీ గౌడ్,లక్ష్మణ్ గౌడ్,అందే స్వామి, సుధాకర్, సామల మహేష్, వినోద్ నాయక్, భాస్కర్ గౌడ్, బొమ్మెన శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన జడ్ పి హెచ్ స్ స్కూల్ విద్యార్థినిలు



**మధిర నవంబర్4(మనవార్త)**తనికెళ్ల సెయింట్ అలోసిస్ హై స్కూల్లో జరిగిన అండర్ 17 బాలికల జిల్లాస్థాయి కబడ్డీ పోటీల నందు మధిర హరిజనవాడ విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచి మధిర మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేసినారు.జడ్.పి.హెచ్.ఎస్ హరిజనవాడ పాఠశాల నుండి భూక్య బిందు, భూక్య సరిత, మాలోతు రాజేశ్వరి జ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక చేశారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నండూరు విజయ శ్రీ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కృష్ణవేణి, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పి డి బొందిలి చైతన్యను అభినందించారు.

## విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న మైనంపల్లి హన్మంతరావు



**గజ్వేల్ నవంబర్ 04 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం దండుపల్లి గ్రామంలో శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా మైనంపల్లి హన్మంతరావు హాజరయ్యారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు,హన్మంతరావు మాట్లాడుతూ అమ్మవారు ప్రజలందరినీ చల్లగా చూడాలని,నల్లపోచమ్మ,ముత్యాలమ్మ విగ్రహాలని ప్రతిష్టించుకొని పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు..ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిట్కుల మహిపాల్ రెడ్డి,సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి,మనోరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి,తూప్రాన్ మాజీ ఎంపీపీ గడ్డి స్వప్న వెంకటేష్ యాదవ్,తూప్రాన్ యూత్ ప్రెసిడెంట్ శశిభూషణ్ రెడ్డి,వర్గల్ మండల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముడుసు శ్రీనివాస్ రెడ్డి,చెన్నయ్య,బిట్ల నవీన్,శ్రవణ్ రెడ్డి,మహబూబ్,పిట్ల కృష్ణ,ప్రభుదాస్,దండుపల్లి కాంగ్రెస్ నాయకులు జంగం లక్ష్మీనారాయణ,చంద్రం,కృష్ణ,జంగం రాజు,స్వామి,రాజు,వెంకటేష్,వంశీ,భాను,స్వామి జాని,ఎల్లెందర్,సంతోష్,ప్రవీణ్,మహేష్,వెంకటేష్,బొర్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీ కౌన్సెలింగ్ పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్



**–చిన్న బోనాలలో కౌన్సెలింగ్ ప్రక్రియ పరిశీలించి, అధికారులకు సూచనలు...**

**రాజన్న సిరిసిల్ల, మన వార్త నవంబర్ – 04** జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి మంగళవారం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. 2025–2026 విద్యా సంవత్సరానికి 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ఇటీవల దరఖాస్తులు ఆహ్వానించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్న బోనాలలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం కౌన్సెలింగ్ నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు.ఆ విద్యాలయంలో ఏర్పాటు చేసిన వివిధ డెస్క్ లు, సర్టిఫికెట్ల పరిశీలనను సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల కో ఆర్డినేటర్ జే జే థెరిసా తదితరులు పాల్గొన్నారు.

## సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలి



**–ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్...**

**–పత్తి కొనుగోళ్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం...**

**రాజన్న సిరిసిల్ల, మన వార్త నవంబర్ – 04** పత్తి రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. పత్తి కొనుగోళ్లు తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సీసీఐ, మార్కెటింగ్ ఇతర శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో ఐదు జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, వేములవాడ పరిధిలో రెండు, కోనరావుపేట మండలంలో ఒకటి, ఇల్లంతకుంట మండలంలో రెండు ఉన్నాయని తెలిపారు. రైతులు తమ సమీపంలోని ఆయా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించి మద్దతు పొందాలని పిలుపు నిచ్చారు.పత్తి నాణ్యత ఆధారంగా క్వింటాలుకు రూ. 7689 నుంచి 8110 మద్దతు ధర ఉందని వెల్లడించారు. కపాస్ కిసాన్‌లో రైతులు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. సీసీఐ, మార్కెటింగ్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో రైతులకు వసతులు కల్పించాలని ఆదేశించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు, మార్కెటింగ్ కార్యాలయాలు, రైతు వేదికల్లో రైతులు స్లాట్ బుకింగ్ చేసుకునేందుకు సహాయం చేయాలని సూచించారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో 42 మంది రైతుల నుంచి 852 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారని వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోళ్లు పక్కాగా చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.కార్యక్రమంలో ఏఎస్పీ చంద్రయ్య, మార్కెటింగ్ అధికారి ప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సీసీఐ సీపీఓ రఘురామ్, అగ్నిమాపక శాఖ, రవాణా శాఖ అధికారులు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాలను అందజేసిన మెదక్ ఎమ్మెల్యే...



**నిజాంపేట నవంబర్ 4( మన వార్త ప్రతినిధి )**నిజాంపేట్ రైతువేదిక లో జాతీయ ఆహార భద్రతా పథకం కింద తెలంగాణ ప్రభుత్వం రాయితీ పై కేటాయించిన 7 క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాలను మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు చేతుల మీదుగా నిజాంపేట్ మండల రైతు లకు పంపిణీ చేయడం జరిగింది నాలుగు కిలోల బస్తా మొత్తం విలువ రూ. 1380 ఉండగా సబ్సిడీ 400 రూపాయలు కాగా రైతు 980 రూపాయలు చెల్లించాలని రైతులకు తెలిపారు,ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్, టిపిసిసి రాష్ట్ర నాయకుడు సుప్రభాతారావు, తహసిల్దార్ శ్రీనివాస్ డిప్యూటీ తాసిల్దార్ రమ్యశ్రీ ఎంపీడీవో రాజిరెడ్డి తోపాటు మండల ప్రజా ప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు, వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలి

**-అలింకో ఉపకరణాలు, సహాయక పరికరాలతో మేలు...**
**-ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్...**
**-ఇల్లంతకుంటలో అలింకో ఉపకరణాలు, సహాయక పరికరాల ఎంపిక శిబిరం పరిశీలన...**
**-ధాన్యం కొనుగోలు కేంద్రం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పరిశీలన...**

**రాజన్న సిరిసిల్ల, మన వార్త నవంబర్ - 04** ఇల్లంతకుంట మండల కేంద్రంలో అలింకో, ఏడీఐపీ, ఆర్వీవై ఆద్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులకు సహాయ ఉపకరణాల పంపిణీకి నిర్వహిస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. అలింకో, ఏడీఐపీ, ఆర్వీవై ఆద్వర్యంలో ఇల్లంతకుంట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న శిబిరాన్ని ఇంచార్జి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు, వృద్ధులకు ఎంపిక కోసం చేస్తున్న ప్రక్రియను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు, వయో వృద్దులు ఉపకరణాలు, సహాయక పరికరాల గుర్తింపు కోసము క్యాంపులు నిర్వహిస్తున్నారని వివరించారు. అర్హులందరూ పాల్గొనాలని సూచించారు. దివ్యాంగులు యూడీఐడీ కార్డ్ కోసం మొబైల్ లేదా మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు కేటాయించిన తేదీల్లో దవాఖానకు వెళ్లాలని, అక్కడ అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులపై



వివక్ష చూపవద్దని, అందరితో సమానంగా గౌరవించాలని పేర్కొన్నారు. అర్హులకు పరికరాలు అందిస్తున్న అలింకో బాధ్యులను అభినందించారు. శిబిరాల్లో అర్హత సాధించిన వారికి చేతి కర్రలు, చంక కర్రలు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్ళు, రోలెటర్స్, ఎం ఎస్ ఐ ఈ డీ కిట్ / ఎం ఆర్ కిట్, స్మార్ట్ కేన్, అంధుల చేతి కర్ర, ఎల్ బో క్రచ్చేస్, అంధ విద్యార్థులకు స్మార్ట్ ఫోన్లు సహాయక పరికరములు అందిస్తారని వెల్లడించారు. ట్రై పాడ్, టెట్రా ప్యాడ్,చేతి కర్రలు, వీల్ చైర్, వాకర్స్, వాష్ రూమ్ వీల్ చైర్, నడుం పట్టి, మెడ పట్టి, వినికిడి యంత్రాలు, ఫూట్ కేర్ యూనిట్, వాకింగ్ స్టిక్ విత్ సీట్, చంక కర్రలు, ఫోమ్ కుషన్, మోకాళ్ళ పట్టీలు, సహాయక పరికరములు ఇస్తారని తెలిపారు. దివ్యాంగులు, వృద్దులు కావాల్సిన పత్రాలు వెంట తీసుకుని రావాలని సూచించారు. ఈ నెల 6వ తేదీ గురువారం చందుర్తి రైతు వేదికలో, 7 వ తేదీన శుక్రవారం వేములవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయముల సముదాయంలో, 10వ తేదీన సోమవారం ముస్తాబాద్ రైతు వేదికలో, 11 వ తేదీన మంగళవారం సిరిసిల్ల సి.నా.రె. కళామందిరంలో శిబిరాలు నిర్వహిస్తారని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. శిబిరంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, ఎంపీడీఓ శశికళ, తదితరులు పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర అందుతుందని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో నిర్వహిస్తున్న ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు, కొనుగోళ్లు పరిశీలించారు. రైతులకు అన్ని వసతులు కల్పించాలని, తేమ శాతం వచ్చిన వెంటనే కొనుగోలు చేసి తరలించాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని వినియోగించుకోవాలి. అర్హులైన వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల ఆర్థిక సాయాన్ని వినియోగించుకొని నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఇల్లంతకుంట లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లును పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో లబ్ధిదారులు తమ కలల ఇంటిని పూర్తి చేసుకోవాలని సూచించారు. సందర్శనలో గృహ నిర్మాణ శాఖ పీడీ శంకర్, ఎంపీడీఓ శశికళ, తదితరులు ఉన్నారు.

# ప్రైవేట్ కంప్లైంట్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

**-జిల్లా ఇన్ చార్జి ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి.బి.పుష్పలత...**

**రాజన్న సిరిసిల్ల, మన వార్త నవంబర్ 04** ఈ నెల 15న జరిగే ప్రత్యేక లోక్ అదాలత్ లో ప్రైవేట్ కంప్లైంట్ కేసులు, పాత కేసుల పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఇన్ ఛార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, అధ్యక్షురాలు జిల్లా న్యాయ సేవాధికర సంస్థ, రాజన్న సిరిసిల్ల శ్రీమతి. బి.పుష్పలత అన్నారు. మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో సిరిసిల్ల బార్ అసోసియేషన్ న్యాయవాదులతో స్పెషల్ లోక్ అదాలత్ పై సమన్వయ




సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ ప్రజల మేలు కోసం పాత కేసుల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, పెండింగ్‌లో ఉన్న చిన్న క్రిమినల్ కేసులు, ఇతర కంపౌండబుల్ కేసులను ఆధునిక పద్ధతుల్లో సమర్ధవంతంగా పరిష్కరించేందుకు, ఈ ప్రత్యేక లోక్ ఆదాలత్ ఉపయోగపడుతుందని అన్నారు. కోర్టులపై కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు, ప్రజలకు త్వరిత న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని గుర్తుచేశారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ , సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జె .శ్రీనివాసరావు మరియు న్యాయవాదులు పాల్గొన్నారు.

# వ్యక్తిత్వ వికాసం పై విద్యార్థులకు అవగాహన



**రాజన్న సిరిసిల్ల, మన వార్త నవంబర్ 04** వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మంగళవారం రోజున ఏపిఏఐ అడ్వాన్సుడ్ సైకలాజికల్ సర్వీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.వేములవాడ రిటైర్డ్ మండల విద్యాధికారి సురేష్ కుమార్ విద్యార్థులకు మాట్లాడుతూ మానసిక వికాసం పెంపొందించుట కోసం అవగాహన కల్పించారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్ధారించుకొని వాటిని సాధించుటకు వారు చేయవలసిన సాధన కోసం చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారత్నం, ఉపాధ్యాయులు మల్లేశం, రవీందర్, కోటేశ్వర్, సలాం, రాజు, హామీద్, బాలకృష్ణ, జ్యోతి, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు బండి సంజయ్ సైకిల్ కానుక...

**-విద్యార్థుల ముఖాల్లో సంతోషం ప్రతిఫలించింది...**

**ఇల్లంతకుంట,నవంబర్ 04 (మన వార్త ప్రతినిధి):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఎంఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బండి సంజయ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా "మోడీ కానుక"గా మంగళవారం సైకిల్ పంపిణీ కార్యక్రమం ఘనంగా



జరిగింది.ఇల్లంతకుంట మండలంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల పదవ తరగతి విద్యార్థిని,విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఈవో లక్ష్మీరాజం,ఎంపీడీవో శశికళ,ఎస్సై సిరిసిల్ల అశోక్,సిపిడిఓ రోజా హాజరయ్యారు.విశిష్ట అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పాల్గొన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేమలత,శ్రీనివాస్ రెడ్డి,మండల బీజేపీ అధ్యక్షుడు భూమల్ల అనిల్ కుమార్ తదితరులు కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ పేదరికం నుంచి సాధారణ విద్యార్థిగా ఎదిగి హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కుమార్ పేద విద్యార్థుల కోసం సైకిల్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.బండి సంజయ్ పుట్టినరోజు సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 20 వేలకుపైగా విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు.ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం కొనసాగించాలనే సంకల్పంతో ఉన్నారు..అని తెలిపారు.అలాగే,1వ తరగతి నుండి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు 'మోడీ కిట్' పేరుతో సహాయ కార్యక్రమం చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు..అని చెప్పారు.విద్యార్థుల కోసం చేస్తున్న ఈ సేవా కార్యక్రమానికి ప్రతిగా విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి మంచి మార్కులు సాధించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎస్సై సిరిసిల్ల అశోక్,ఎంపీడీవో శశికళ విద్యార్థులకు ప్రేరణాత్మక మాటలు చెప్పారు.క్రమశిక్షణ, కృషి,పట్టుదలతో చదువులో మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యార్థులను ఉత్సాహపరిచారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుజ్జ శ్రీనివాస్,అడిచెర్ల రాజు,సంఘ నరేష్,సామ బాల్ రెడ్డి,సీనియర్ ఉపాధ్యాయులు వి.మహేష్ చంద్ర,ఆర్.రమణారెడ్డి,ఎన్.మధుసూదన్ రావు,ఎం.మంజుల,ఎం.లత,పి.అనిల్ కుమార్,పి.సునీత,ఏ.కవిత,పి.స్వప్న,సి.హెచ్.సంపత్ రావు,వి.సరిత,ఫయాజ్ మొహమ్మద్,ఎస్.సుజాత దేవి,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# గృహప్రవేశాలకు ఇదిరమ్మ ఇండ్లు రెడీ...



**రాజన్న సిరిసిల్ల, మన వార్త నవంబర్ 04** తంగళ్లపల్లి మండల కేంద్రంలో నమూనా ఇందిరమ్మ ఇళ్ళు నిర్మాణాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు,నాయకులు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాళ్లపేట, అంకిరెడ్డిపల్లె,అంకుసాపూర్,కస్బే కట్కూర్,మండేపల్లి గ్రామాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం ఈ నెల 6వ తేదీనా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం అట్టహాసంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.నిరుపేదల స్వంతింటి కల సాకారం చేస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డి ది అని అన్నారు.గూడు లేని నిరుపేదలు ఎవ్వరు ఉండకూడదన్నదే ఇందిరమ్మ ప్రజా పాలన ఉద్దేశ్యమంటూ ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు..

## కార్తిక మాసం సందర్భంగా కాశీ భాగ్ ఆంజనేయస్వామి ఆలయంలో సుజిత్ రావు ప్రత్యేక పూజలు



**కోరుట్ల, నవంబర్ 04 ( మన వార్త ప్రతినిధి ) :** కార్తికమాసం సందర్భంగా మెట్‌పల్లి పట్టణంలోని కాశీభాగ్ ఆంజనేయస్వామి దేవాలయంలో ఈ రోజు టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని సందర్శించిన ఆయన ఆంజనేయస్వామి వారికి అభిశేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించి దేవాలయ పూజారుల చేత ఆశీర్వాదం పొందారు.ఈ సందర్భంగా పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య సుజిత్ రావు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేయించి వారికి దేవుడి ప్రసన్నత కలగాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో భక్తులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డెక్కిన గురుకుల పాఠశాల విద్యార్థినిలు ఆర్డీవో రావాలని డిమాండ్

**కోరుట్ల, నవంబర్ 04 ( మన వార్త ప్రతినిధి ) :** జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి పట్టణం అరపేట శివారులో గల తెలంగాణ



సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఇంచార్జ్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ విద్యార్థులు జాతీయ రహదారి సంఖ్య 63 (ఆర్మూర్%-%జగిత్యాల రహదారి) పై పరిటాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తక్షణమే జిల్లా ఆర్డీఓ వచ్చి తమ సమస్యలు విని, వేధింపులకు పాల్పడుతున్న ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌ను తొలగించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. వారి ఆందోళనతో కొంతసేపు నేషనల్ హైవేపై ట్రాఫిక్ అంతరాయం కలిగింది. పోలీసు, విద్యాశాఖ అధికారులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి విద్యార్థులతో చర్చలు జరిపారు.

# న్యాయవాదుల సమస్యలను పరిష్కరించే వారికే మా ఓటు

**-బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఈసారి పనిచేసే వారికే పట్టం....**
**-వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం...**

**రాజన్న సిరిసిల్ల, మన వార్త నవంబర్ 04** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను



పరిష్కరించే వారికే డిసెంబర్ లో జరిగే బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించడం జరుగుతుందని వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం అన్నారు. మంగళవారం బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థి హైకోర్టు ప్రముఖ న్యాయవాది రాపోలు భాస్కర్ ప్రచారంలో భాగంగా వేములవాడ బార్ అసోసియేషన్ హాల్ కు విచ్చేసి తనకు మద్దతు తెలిపి గెలిపించినట్లయితే న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ గతంలో బార్ కౌన్సిల్ మెంబర్లుగా గెలుపొందినవారు న్యాయవాదుల సమస్యలను పట్టించుకోలేదని, కనీసం బార్ కౌన్సిల్ కు వెళ్ళిన సందర్భంలో కూడా పలకరించిన దాఖలాలు లేవని, చాలా సమస్యలతో న్యాయవాదులు సతమతమవుతున్నారని, న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

## వెంకట్రావు పల్లి లో నూతనంగా ఏర్పాటైన బాలల సంరక్షణ కమిటీ...

**చిన్న శంకరంపేట నవంబర్ 4 ( మన వార్త ప్రతినిధి )**చిన్న శంకరంపేట మండలం వెంకట్రావు పల్లి గ్రామంలో మెదక్ జిల్లా విజన్ ఎన్జీవో కమ్యూనిటీ మొబైల్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పద్మ అధ్యక్షతన గ్రామస్థాయి బాలల రక్షణ కమిటీని ఏర్పాటు చేశారు, గ్రామంలో బాల్య వివాహాలు చేయకుండా ఉంటామని, 18 సంవత్సరాలలోపు అమ్మాయిలకు 21 సంవత్సరంలోపు అబ్బాయిలకు వివాహం చేయడం నేరమని ఎలాంటి బాల్యవివాహాలు చేయకుండా కట్టుబడిగా ఉంటామని గ్రామస్తులు తీర్మానించారు, ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు వీజన్ ఎన్జీవో కమ్యూనిటీ మొబైల్ సిబ్బంది యాదగిరి తదితరులు పాల్గొన్నారు.




## ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ వెంటనే చెల్లించాలని ఏబీవీపీ ధర్నా

**కోరుట్ల, నవంబర్ 04 ( మన వార్త ప్రతినిధి ) :** జగిత్యాల జిల్లా మెట్పల్లి పాత బస్టాండ్ శాస్త్రి చౌరస్తా వద్ద మంగళవారం ఏబీవీపీ నాయకులు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్‌ల చెల్లింపులో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ జాతీయ రహదారిపై నిరసనకు దిగారు. ఏబీవీపీ కార్యకర్తలు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దిష్టిబొమ్మ దహనం చేయడానికి ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో విద్యార్థి నాయకులు, పోలీసులు మధ్య తోపులాట చోటుచేసుకుంది. ట్రాఫిక్ పూర్తిగా స్తంభించగా, పోలీసులు జిల్లా కన్వీనర్ మాడవేని సునీల్, జిల్లా హాస్టల్ కన్వీనర్ మారుతి, పట్టణ అధ్యక్షుడు కలికోట ప్రణీత్‌లను అదుపులోకి తీసుకుని పోలీసు వాహనంలో తరలించారు. ఈ ఘటనతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కార్యక్రమంలో ఏబీవీపీ జాయింట్ సెక్రటరీ సాయికుమార్, మున్నా, సూర్య, మణి తదితరులు పాల్గొన్నారు.



## వరికుప్పను ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు ఆసుపత్రికి తరలింపు...

**చిన్న శంకరంపేట నవంబర్ 4( మన వార్త ప్రతినిధి )**చిన్న శంకరంపేట మండలం సంగయ్య పల్లి శివారులో వారి ధాన్యం కుప్పను ఢీకొని టీవీఎస్ ఎక్సెల్ వాహనదారుడు రోడ్డుపై పడడంతో తలకు తీవ్రంగా గాయాలయ్యాయి, స్థానికులు 108 అంబులెన్స్ కు సమాచారం అందించి అంబులెన్స్ లో మెదక్ ఆసుపత్రికి తరలించారు. గాయాలైన వ్యక్తి మదూరు గ్రామానికి చెందిన పోతరాజు శ్యాములుగా గుర్తించారు.



## విద్యార్థులు ఆత్మహత్యాయత్నం...

**జమ్మికుంట, నవంబర్ 04( మన వార్త ప్రతినిధి):** జమ్మికుంట పట్టణంలో దారుణం చోటు చేసుకుంది.పట్టణం లోని ఎస్వీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో తొమ్మిదవ తరగతి విద్యార్థులు పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారు.తొమ్మిదవ తరగతి చదువుతున్న చరణ్ కుమార్, రామ్ చరణ్ అనే ఇద్దరు విద్యార్థులు హాస్టల్ నుండి బయటకు వెళ్లి ధూమపానం( సిగరెట్లు)సేవిస్తున్నారని తెలిసిన ఉపాధ్యాయులు మందలించి వారి తల్లిదండ్రులను తీసుకోని రావాలని చెప్పడంతో భయపడి సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారని సమాచారం. గడ్డి మందు తాగారని గమనించిన పాఠశాల సిబ్బంది స్థానిక ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఏబీవిపి నాయకులు స్కూల్ ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు.పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారని,విద్యార్థుల తల్లిదండ్రుల కు న్యాయం చేయాలని,స్కూల్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పట్టణ సీఐ రామకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.



## వృద్ధురాలికి ఆక్సిజన్ కాన్సెంట్రేటర్ అందజేత...

**జమ్మికుంట, నవంబర్ 04( మన వార్త ప్రతినిధి):**హుజురాబాద్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన గుడి వసంత (75 ) అనారోగ్యం కారణాల వల్ల ఆస్పత్రిలో చేరగా ఆక్సిజన్ కాన్సెంట్రేటర్ అవసరం ఉందని ఆలయఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్ ను సంప్రదించగా ఆలయఫౌండేషన్ మార్గదర్శకులు పరికిపండ్ల నరహరి ఐఏఎస్ అధికారి చొరవతో వృద్ధురాలికి ఆక్సిజన్ కాన్సెంట్రేటర్ ను మంగళవారం అందించారు.గత పది సంవత్సరాలుగా ఉమ్మడి కరీంనగర్,ఆదిలాబాద్,వరంగల్ జిల్లాలో విద్యా, వైద్యం మరియు ఉపాధి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ,గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు మరియు వికలాంగులకు జైపూర్ ఫుట్ ను మరియు తలసేమియా వ్యాధి చిన్నారుల కోసం రక్తదాన శిబిరాల ను నిర్వహిస్తూ ఆలయఫౌండేషన్ పరికిపండ్ల నరహరి అధ్వర్యంలో సేవలు అందిస్తున్నట్లు గుణ సాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు పెద్ది కుమార్, పోరెడ్డి కిషన్ రెడ్డి గుడి శ్రీధర్ రెడ్డి,ఆలయఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్ నేత పాల్గొన్నారు.



## ప్రైవేట్ కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రి సేవలు...

**జమ్మికుంట/హుజురాబాద్, నవంబర్ 04( మన వార్త ప్రతినిధి):**జమ్మికుంట మండలం, మడిపల్లి గ్రామానికి చెందిన బోగ భిక్షపతి – కరుణ దంపతుల కుమార్తె ప్రవళిక, అక్టోబర్ 30, 2025 గురువారం రోజున, హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఇది ప్రవళిక కు రెండవ కాన్పు కావడం విశేషం. ఆమె మొదటి ప్రసవం కూడా ఇదే ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగింది. అయితే, రెండవ గర్భధారణ సమయంలో, ప్రవళిక గర్భాశయంలో కణితి పెరిగినట్లు వైద్యులు గుర్తించారు. ప్రైవేట్ ఆసుపత్రుల కంటే ప్రభుత్వ ఆసుపత్రి పై ఉన్న నమ్మకంతో, ప్రవళిక కుటుంబసభ్యులు ఇక్కడే చికిత్సకు మొగ్గు చూపారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు అత్యంత నైపుణ్యంతో, ఒకే శస్త్రచికిత్సలో కణితి తొలగింపు మరియు ప్రసవం రెండింటినీ విజయవంతంగా నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో, గర్భాశయాన్ని తొలగించకుండానే కణితిని తొలగించి, ప్రవళిక పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు, క్లిష్టమైన చికిత్సలు కూడా సురక్షితమైనవి, నమ్మకమైనవని మరోసారి రుజువైందని ప్రవళిక భర్త మంతెన ప్రవీణ్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిపై తమకున్న నమ్మకం రెట్టింపు కావడంతో, ఆయన మంగళవారం రోజున ఆసుపత్రి వైద్యులను, సిబ్బందిని ప్రత్యేకంగా సన్మానించి, స్వీట్లు పంచి కృతజ్ఞతలు తెలిపారు.




## రెక్కల కష్టం నీటిపాలు...

**జమ్మికుంట, నవంబర్ 04( మన వార్త ప్రతినిధి):**అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులకు కోలుకోలేని నష్టం జరిగింది. రెక్కల కష్టం నీటిపాలు అయింది.జమ్మికుంట పాత వ్యవసాయ మార్కెట్ లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన ధన్యం అకాల వర్షానికి తడిసి ముద్దయింది. వర్షానికి కొట్టుకపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మార్కెట్ చైర్ పర్సన్ పుల్ సప్న సదానందం పరిశీలించారు.రైతులు వారి గోడు వెళ్లబోసుకున్నారు. ధాన్యం తూకంలో గాని,రైసు మిల్లులలో ధాన్యం దిగుమతిలో ఇబ్బందులు తలెత్తితే సమాచారం ఇవ్వాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి...

**- ఐఎఫ్ డబ్ల్యూజె జాతీయ కౌన్సిల్ సభ్యులు బాపురావు...**

**- ఘనంగా ఐఎఫ్ డబ్ల్యూజే వజ్రోత్సవ సంబరాలు...**

**కరీంనగర్,నవంబర్04( మన వార్త ప్రతినిధి):** జర్నలిస్టు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్ డబ్ల్యూజె జాతీయ కౌన్సిల్ సభ్యులు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు డిమాండ్ చేశారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్( ఐఎఫ్ డబ్ల్యూజె) 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కరీంనగర్ లోని ఫెడరేషన్ కార్యాలయంలో మంగళవారం వజ్రోత్సవ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ గత 75 సంవత్సరాలుగా జర్నలిస్టుల సమస్యలపై చేస్తున్న పోరాటాలను, సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నారు. ముందుగా జాతీయ అధ్యక్షుడు కామ్రేడ్ డాక్టర్ కె. విక్రమ్ రావుకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాపురావు మాట్లాడుతూ. ఐఎఫ్ డబ్ల్యూజే దేశంలోనే తొలి జర్నలిస్టు యూనియన్ అని 1950 అక్టోబర్ 28న ట్రేడ్ యూనియన్ గా ఏర్పడిందన్నారు. దేశవ్యాపితంగా 30 వేలకు పైగా జర్నలిస్టులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. దేశంలోనే 28 రాష్ట్రాల తో పాటు శ్రీలంక, నేపాల్, భూటాన్ లోని జర్నలిస్టుల సంఘాలతో సంబంధాలు కలిగి జర్నలిస్టుల సమస్యలపై అంతర్జాతీయ స్థాయిలో కూడా పోరాటాలు చేస్తున్నదని పేర్కొన్నారు. జర్నలిస్టుల శ్రేయస్సు కోసం ఐఎఫ్ డబ్ల్యూజె కొన్ని ప్రధాన డిమాండ్లను అమలు చేయాలని ప్రభుత్వం పై ఒత్తిడి చేస్తూ వస్తున్నదన్నారు. అందులో ముఖ్యంగా జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్ తక్షణం అమలు చేయాలి. జర్నలిస్టులకు అవసరమైన సంక్షేమ పథకాలు అమలు చేయాలి. సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ పథకం అమలు చేయాలి. దేశవ్యాప్తంగా జర్నలిస్టుల ఐక్యతను కొనసాగిస్తూ కనీస వేతనం కోసం వేజ్ బోర్డు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో జర్నలిస్టులకు ప్రభుత్వం హెల్త్ కార్డులను అందించి అన్ని కార్పొరేట్ ప్రైవేట్ ఆసుపత్రులలో పని చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. గత సంవత్సరంన్నర కాలంగా అక్రిడేషన్లను పొడిగించడం సరికాదన్నారు. వెంటనే నూతన అక్రిడిటేషన్ కార్డులను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నరేందుల ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు గాదె కరుణాకర్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు, కొమ్ము గణేష్, సురేష్, సహాయ కార్యదర్శి కిరణ్, నాయకులు శంకర్ రెడ్డి, సతీష్, జీవన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## లక్ష్మీదేవి పేటలో ఘనంగా మీసేవ అవతరణ దినోత్సవం

**వెంకటాపూర్ , (రామప్ప)నవంబర్ 4: మన వార్త ప్రతినిధి** ములుగు జిల్లా మీసేవ ఈడియం సమాజి దేవేందర్, డి యం పోలోజు విజయ్ సమాచారం మేరకు వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవి పేట గ్రామం పరిధిలోగల మీ సేవ వి ఎల్ ఈ చిలుక తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం మీసేవ అవతరణ దినోత్సవం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా మీ సేవకు వచ్చిన లబ్ధిదారులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ 2011 నవంబర్ 4న మీసేవ అవతరణ దినోత్సవం జరిగిందని అన్నారు. దీని ద్వారా ప్రజలకు అందుబాటులో సులువుగా జరిగే పనులు మీసేవ ద్వారా జరుగుతున్నాయని వారు అన్నారు. లక్ష్మీదేవి పేట ప్రతి లోగల అన్ని గ్రామాల ప్రజలు మీ సేవను సద్వినియోగం చేసుకోవాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో మీసేవ లబ్ధిదారులు చిర్ర గణేష్, వరికోల్ రమేష్, దేనబోయిన శంకర్, కడివండి తిరుపతి, గుగులోతు వాగ్య, మేక రమేష్ తదితరులు ఉన్నారు.




## పీర్జాదిగూడలో విద్యుత్ లోవోల్టేజ్ సమస్యల పరిష్కారానికి కృషి తుంగతుర్తి రవి

**తెలంగాణస్టేట్ బ్యూరో, భాస్కర్ చారి, నవంబర్ 4, మనవార్త.** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న లో వోల్టేజ్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో నూతన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు కోసం తగిన స్థలాన్ని గుర్తించే దిశగా, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి పలు ప్రాంతాలను పర్యటించారు. ఈ పర్యటన సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని రవి సూచించారు. రవి మాట్లాడుతూ, "ప్రజల ఇబ్బందులు మాకు ముఖ్యమైనవి, విద్యుత్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రతి ఇంటికీ స్థిరమైన విద్యుత్ సరఫరా అందించే లక్ష్యంతో ఈ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్తున్నాం. అలాగే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన విద్యుత్ అధికారులకు ఏ ఈ సత్యనారాయణ రెడ్డికి వారి సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఏఈ సత్యనారాయణ రెడ్డి, లైన్ మెన్ భాస్కర్, కాంట్రాక్టర్ లు,రాంగోపాల్ రావ్, శ్రీనివాస్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి ఉమెన్స్ కాలేజీ హౌస్ కీపింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు యూనిఫాం పంపిణీ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నవంబర్ 4 (మనవార్త ప్రతినిధి )** సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని ఉమెన్స్ కాలేజీ హౌస్ కీపింగ్ కాంటాక్ట్ కార్మికులకు మంగళవారం నాడు సింగరేణి కాంట్రాక్ట్



వర్కర్స్ యూనియన్- ఏ ఐ టి యు సి కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కె డబ్ల్యూ కృష్ణ ఫర్ మరియు కాంట్రాక్టర్ మూర్తి చేతుల మీదుగా యూనిఫాం పంపిణీ చేయడం జరిగింది. అడిగిన వెంటనే యూనిఫాం పంపిణీ చేసిన కాంట్రాక్టర్ కు యూనియన్ నాయకులు,కాంట్రాక్ట్ కార్మికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## పత్తి కొనుగోళ్లు నిలిపివేత...



**జమ్మికుంట, నవంబర్ 04( మన వార్త ప్రతినిధి):**రాష్ట్ర జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ సమ్మె కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యవసాయ మార్కెట్లో పత్తి కొనుగోల్లు నిలిపి వేస్తున్నట్టు మార్కెట్ కార్యదర్శి మల్లేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిన్నింగ్ మిల్లులలో సీసీఐ కొనుగోలుతో పాటు ప్రైవేటు వ్యాపారస్తులు పత్తి కొనుగోలు నిలిపివేస్తామని అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా ఆదరణ పథకం కలెక్టర్‌కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ శాఖ అధికారులు సీసీఐ అధికారులు అసోసియేషన్ తొ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. బుదవారం కార్తీక పౌర్ణమి, గురునానక్ జయంతి సందర్భంగా మార్కెట్ సెలవు, సిసిఐ కొనుగోళ్ల కు సంబంధించిన అంశాలు రాష్ట్ర ప్రభుత్వం పరిశీలనలో ఉన్నందున, ప్రభుత్వం నుండి ఆదేశాలు ఇచ్చేవరకు పత్తిని రైతులు మార్కెట్ యార్డుకు తీసుకురావద్దని, కపాస్ కిసాన్ మొబైల్ యాప్ లో స్లాట్ బుక్ చేసుకోవద్దని తెలిపారు. రైతులు గమనించాలని కోరారు.

## మార్పుకు నాంది పలికిన బూజునూరు గ్రామం...

**జమ్మికుంట, నవంబర్ 04( మన వార్త ప్రతినిధి):** ఇల్లందకుంట మండలం బూజునూరు గ్రామానికీ చెందిన ప్రముఖ ఎన్ఆర్ఐ సరిగొమ్ముల హరి ప్రసాద్ తన స్వగ్రామంలో వినూత్న పద్ధతిలో కొత్త ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ ఇంటికి కి "రాజ గృహ" అనే పేరును



పెట్టదల్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్నేహితులు, బంధువుల సమక్షం లో గౌతమ బుద్ధుడు మరియు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ ల చిత్ర పటాలకు పూల మాలలు వేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇది కేవలం ఒక ఇల్లు మాత్రమే కాదు, గ్రామ అభివృద్ధికోసం చర్చించే వనరుల కేంద్రంగా పని చేస్తుందని హరి ప్రసాద్ చెప్పారు. విద్యా, ఆరోగ్యం, వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు స్టూడెంట్స్ కి టెక్నాలజీ ని దగ్గర చేసే టెక్నికల్ హబ్ గా మారుస్తానని హరి ప్రసాద్ గ్రామస్థులతో చెప్పారు. గ్రామస్థులు హరి ప్రసాద్ సరిగొమ్ముల ఈ సరికొత్త ఆలోచనను అభినందిస్తూ, అమెరికాలో ఉంటున్నా మూలాలు మరువలేదని, గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని ప్రశంసించారు. ఈ ఆలోచన విధానాన్ని కి అభినందిస్తూ పండగ వాతావారణం తలపించేలా టపాసులు కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. తను ఎలాంటి కార్యక్రమాలు తలపెట్టిన మేము వెన్నంటే ఉంటామని, ఈ కార్యక్రమంతో గ్రామస్థులు బూజునూరు గ్రామం సరికొత్త మార్పు దిశగా అడుగులు వేసిందని తెలిపారు.

## రాత్రి అన్నం తినడం మానేస్తున్నారా?



ప్రస్తుత రోజుల్లో అధిక బరువు పెద్ద సమస్యగా మారుతుంది. బరువు ఎలా తగ్గాలి అని చేయని పనులు ఉండవు కొందరు. ఇందులో భాగంగానే కొందరు రాత్రి పూట భోజనం చేయడం మానేస్తారు. రాత్రి పూట అధికంగా ఆహారం తీసుకుంటే బరువు పెరుగుతారు అని చెబుతుంటారు నిపుణులు. దీంతో కొందరు మొత్తానికే ఆహారాన్ని తీసుకోకుండా ఉంటున్నారు. కానీ దీని వల్ల చాలా సమస్యలు వస్తాయట. ఇంతకీ రాత్రి భోజనం చేయకపోవడం వల్ల శరీరంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో ఓ సారి తెలుసుకోండి. సాధారణంగా ఉదయం మధ్యాహ్నం కంటే రాత్రిళ్లు తక్కువ ఆహారం తీసుకోవాలి అని చెబుతుంటారు నిపుణులు. రాత్రి శరీరానికి శ్రమ ఉండదని ఈ సలహా ఇస్తారు. బిజీ లైఫ్ లో రాత్రి పది తర్వాత భోజనం చేసే వారి సంఖ్య మరింత పెరుగుతుంది. దీంతో తినగానే వెంటనే నిద్ర పోయే వారి సంఖ్య కూడా పెరుగుతుంది. దీనివల్ల ఊబకాయం, డయాబెటిస్ వంటి సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కానీ రాత్రి తినకుండా ఉండటం కూడా మంచిది కాదు. దీనివల్ల ఎన్నో సమస్యలు వస్తాయట. రాత్రి పూట పూర్తిగా ఆహారం తీసుకోకుండా ఉండడం ప్రమాదకరం. దీనివల్ల ఇన్సులిన్ స్థాయిలు క్షీణిస్తాయి. తద్వారా శరీరంపై తీవ్ర ప్రభావం ఏర్పడుతుంది. రాత్రిపూట ఆహారం తీసుకోకపోతే గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు పెరుగుతాయట. దీనివల్ల జీర్ణ సంబంధిత సమస్యలు వచ్చే ఛాన్స్ ఎక్కువగా ఉంటుంది. అలాగే అల్సర్, ఎసిడిటీ వంటి సమస్యలు కూడా మొదలవుతాయి అంటున్నారు నిపుణులు. రాత్రిళ్లు తక్కువ ఆహారం తీసుకోవడం వల్ల ఎలాంటి సమస్య ఉండదు. పైగా బరువు తగ్గడంలో సహాయపడుతుంది కానీ పూర్తిగా ఆహారం తీసుకోవడం మానేస్తే చాలా సమస్యలు మాత్రం ఎదుర్కోవాల్సి వస్తుంది. గుండెలో మంట, పుల్లని త్రేన్పులు వంటి సమస్యలు వచ్చే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది అని చెబుతున్నారు నిపుణులు. మరి తెలుసుకున్నారు కదా ఆహారం సరిగా తీసుకోకపోతే ఎలాంటి సమస్యలు వస్తాయో.. ఇప్పుడు అయినా మీ డైట్ ను మార్చుకోండి.

## విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ హుజురాబాద్ నియోజకవర్గం అధ్యక్షులుగా కట్ట నాగభూషణాచారి

**జమ్మికుంట, నవంబర్ 04, (మనవార్త ప్రతినిధి )** హుజురాబాద్ నియోజకవర్గం 2026-2028 సంవత్సరం నూతన విశ్వబ్రాహ్మణ



అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక సమావేశము జమ్మికుంట చాణిక్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఏర్పాటు చేశారు. జిల్లా వోపా ఎన్నికల అధికారిగా వేములవాడ మధుసూదనా చారి, ముఖ్య అతిథులుగా జిల్లా వోపా అధ్యక్షులు గద్దె సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గాలిపెల్లి శంకరయ్య, గాలిపెల్లి బ్రహ్మాచారి, లింగన్నపేట సత్యం హాజరైనారు. ఈ సమావేశంలో వోపా హుజురాబాద్ నియోజకవర్గం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా అధ్యక్షులుగా కట్ట నాగభూషణాచారి, ప్రధాన కార్యదర్శిగా మునిగంటి సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ విజయగిరి తులసిదాసు, ఉపాధ్యక్షులుగా, మామిడోజు సదానందచారి, తాటికొండ భద్రాచారి, కార్యదర్శులుగా వడ్లూరు సత్యనారాయణ, పెద్దప్యాట ఇందుమూర్తి, ఆర్థిక కార్యదర్శిగా శ్రీరంగు ప్రశాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా తాటికొండ శ్రీనివాస్, సలహాదారులుగా చిట్టిమల్ల మల్లికార్జున్, కట్ట రాజావీరాచారి, ప్రత్యేక ఆహ్వానితులుగా రాంపల్లి రాజయ్య, శ్రీరామోజు సందీప్, కార్యవర్గ సభ్యులుగా, మునిగంటి సుధాకర్, మామిడోజు సత్యనారాయణ, ముత్తోజు బిక్షపతి, కలికోట జయప్రకాష్, విజయగిరి ఈశ్వరయ్య, పెద్దప్యాట సతీష్, ముడుపు రాజేష్, వల్లముపట్ల ఈశ్వరయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా హుజురాబాద్ వోపా నియోజకవర్గం అధ్యక్షులు కట్ట నాగభూషణ చారి మాట్లాడుతూ, నా ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్క సభ్యుడికి, జిల్లా నాయకులకు, అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


## పేదల సంజీవనితో ప్రయోజనాలు మెండు...



ప్రస్తుత ఆహార అలవాట్లు, మారుతున్న జీవన శైలి వల్ల ఎన్నో సమస్యలు వస్తున్నాయి. సమయం లేకపోవడం, సరైన ఫుడ్ తీసుకోకపోవడం, టెన్షన్ వంటి వాటి వల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. అందుకే కొన్ని ఆహార నియమాలను డైట్ లో చేర్చుకోవాలి అంటారు నిపుణులు. కొన్ని ఖర్చుతో కూడుకున్నవి అయితే మరికొన్ని చవకగా దొరుకుతాయి. మీకు బార్లీ తెలుసా? పేదల పాలిట పెన్నిది. బార్లీలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఇందులో ఉండే పోషకాలు ఎన్నో సమస్యలకు దివ్యౌషధాలుగా ఉపయోగపడుతాయి. అందుకే బార్లీ నీటిని ప్రతి రోజు ఉదయం తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల శరీరానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. పేదల సంజీవని అయినా బార్లీ డయాబెటిస్ కు చాలా మంచిది. బార్లీ నీరు రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించడానికి, నియంత్రించడానికి ఉపయోగపడుతాయి. హృదయనాళ ఆరోగ్యాన్నిమెరుగుపరచడమే కాదు.. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. ఈ బార్లీ నీటిలో ఫైబర్ శాతం ఎక్కువ ఉంటుంది. ఇవి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. దీనివల్ల మలబద్దక సమస్య దూరం అవుతుంది. శరీరంలో ఉన్న అదనపు కొవ్వును కూడా తగ్గిస్తుంది బార్లీ నీటిలో తక్కువ క్యాలరీలు ఉంటాయి కాబట్టి కావలసిన శక్తి కూడా అందుతుంది. బరువు పెరగరు. బార్లీ గింజలను ఉడకబెట్టి వడకట్టిన తర్వాత కాస్త రుచి కోసం నిమ్మరసం కూడా జోడిరచవచ్చు. యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ కి అద్భుతమైనది బార్లీ నీరు. వీటిని తాగడం వల్ల మూత్రాశయ సమస్యలు దూరం చేస్తాయి. అంతేకాదు ఆరోగ్యాన్ని అందిస్తాయి. చర్మానికి చాలా మంచిది. రక్తపోటును నియంత్రించడంలో కూడా తోడ్పడతాయి. మరి తెలుసుకున్నారు కదా బార్లీ నీటితో ఎంత ఉపయోగమో..ఇన్ని ప్రయోజనాలు ఉన్న బార్లీ నీటిని తాగేసేయండి. మంచి ఆరోగ్యం మీ సొంతం చేసుకోండి.

## వాకింగ్ అవసరం లేకుండా

## ఈ 4 పనులు చేస్తే బరువు తగ్గుతారు..



ఆరోగ్యానికి వ్యాయమం తప్పనిసరి. నేటి కాలంలో ప్రతి ఒక్కరూ బిజీగా ఉండడంతో ఆరోగ్యంపై అశ్రద్ధ వహిస్తున్నారు. దీంతో అనేక కొత్త రోగాలు వస్తున్నాయి. వివిధ రకాల ఆహార పదార్థాలు తినడం వల్ల బరువు పెరుగుతున్నారు. బరువు తగ్గించుకునేందుకు రోజూవారీ జీవితంలో శారీరక శ్రమ తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. సాఫ్ట్ జాబ్స్ చేసేవాళ్లు బరువు తగ్గాలంటే రోజులో కనీసం కొన్ని నిమిషాల్కైనా వాకింగ్ చేస్తే ఆరోగ్యంగా ఉండగలుగుతారని అంటున్నారు. అయితే చాలా మందికి సమయం లేకపోండంతో వాకింగ్ చేయడం కుదరడం లేదు. వాకింగ్ చేయాలని ఉన్నా ఒక్కోసారి శరీరం సహకరించదు. ఈ నేపథ్యంలో వాకింగ్ కు ప్రత్యామ్నాయంగా ఇలా చేస్తే బరువు తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. స్కిప్పింగ్: చిన్నప్పుడు స్కూళ్లలో చదువుకునేటప్పుడు స్కిప్పింగ్ ను గేమ్ లో భాగంగా చేర్చేవారు. కానీ ఇప్పుడు ఇది ఆరోగ్యాన్ని కూడా పెంచుతుంది. ప్రతిరోజూ కొన్ని నిమిషాల పాటు స్కిప్పింగ్ చేయడం వల్ల శరీరంలోని బరువు తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. ఇది సింగిల్ గా కాకుండా సన్నిహితులతో కలిసి గేమ్ లగా ఏర్పాటు చేసుకొని స్కిప్పించ్ చేయడం వల్ల మరింత ఉత్సాహంగా ఉంటారంటున్నారు. స్కిప్పింగ్ చేయడం వల్ల కండరాల గట్టిపడుతాయి. చెమటకు బయటకు తీస్తుంది. దీంతో ఆరోగ్యంగా ఉండగలుగుతారు. ట్రెక్కింగ్: కొందరు ఖాళీ సమయం దొరికితే సినిమాలు, షికార్లకు వెళ్తుంటారు. ఈ సమయాన్ని ట్రెక్కింగ్ కు ఉపయోగిస్తే మనసు ఉల్లాసంగా ఉండడంతో పాటు ఆరోగ్యంగా ఉండగలుగుతారని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ట్రెక్కింగ్ చేయడం వల్ల గుండె పనితీరు మెరుగుపడుతుంది. ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. ట్రెక్కింగే చేసే ప్రదేశాలు తక్కువే ఉంటాయి. అయితే తీరిక దొరకినప్పుడల్లా ట్రెక్కింగ్ ను ఎంచుకోవడం ఉత్తమం అనిఅంటున్నారు. మెట్లు ఎక్కడం: నేటి కాలంలో పెద్ద పెద్ భవనాలు నిర్మీతమవుతున్నాయి. దీంతో వాటిల్లో లిఫ్ట్ లు తప్పనిసరిగా ఉంటున్నాయి. చాల వరకు పై ఫ్లోర్ కు అర్జంట్ గా వెళ్లాలంటే లిఫ్ట్ ను వాడడంలో తప్పు లేదు. కానీ సమయం ఉన్నప్పుడు లిఫ్ట్ ను అవైడ్ చేసి మెట్ల మీద నుంచి వెళ్లేందుకు ప్రయత్నించాలి. ఇలా ప్రతి రోజూ కనీసం రెండు సార్లు అయినా మెట్ల ఎక్కడం వల్ల కాళ్ల కండరాలు గట్టిపడుతాయి. ఎక్కువ శాతం మెట్లు ఎక్కడం వల్ల బరువును అదుపులో ఉంచుతుంది. డ్యాన్స్: కొందరు చిన్నప్పుడు బాగా డ్యాన్స్ చేస్తారు. కానీ పెద్దయ్యాక సిగ్గుపడుతారు. కానీ ఇష్టమైన మ్యూజిక్ తో ప్రతిరోజూ డ్యాన్స్ చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని కొందరు వైద్య నిపుణులు చెబుతున్నారు. డ్యాన్స్ చేయడం వల్ల డిప్రెషన్ నుంచి బయటపడుతారు. ఒత్తిడిని తగ్గించి ప్రశాంతంగా ఉండేలా చేస్తుంది. అయితే ఇంట్లో ఎవరూ లేనప్పుడు బిగ్గరగా సౌండ్ వేసుకోవడం ద్వారా ఎక్కువ సేపు డ్యాన్స్ చేయగలుగుతారు.

## బిల్లులు కట్టకుండానే ఉడాయించిన లీగ్ నిర్వాహకులు



**శ్రీనగర్,** ఇండియన్ హెవెన్ ప్రీమియర్ లీగ్ పేరుతో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌పై వివాదం చెలరేగింది. ఈ లీగ్ నిర్వాహకులపై జమ్మూ కశ్మీర్ పోలీసులు మోసం కేసు నమోదు చేశారు. శ్రీనగర్‌లో జరిగిన ఈ టోర్నమెంట్‌లో అంతర్జాతీయ ఆటగాళ్లు పాల్గొన్నారు. అందులో పశ్చిమ ఇండీస్ స్టార్ క్రికెటర్ క్రిస్ గేల్ కూడా ఉన్నారు.అయితే టోర్నీ ముగిసిన తర్వాత నిర్వాహకులు హెూటల్ బిల్లులు, చెల్లింపులు చేయకుండానే పరారైనట్లు ఫిర్యాదు వచ్చింది. దీంతో శ్రీనగర్‌లోని రాజ్‌బాగ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. భారతీయ దండన స్మృతిలోని మోసం కేసు కింద విచారణ ప్రారంభమైందని అధికారులు తెలిపారు.అక్టోబర్ 25న ప్రారంభమైన లీగ్ బక్షీ స్టేడియంలో అక్టోబర్ 25న ప్రారంభమైన ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. రాష్ట్ర క్రీడామంత్రి సతీష్ శర్మ ఈ లీగ్‌ను ప్రారంభించారు. పంజాబ్‌లోని మొహాలీకి చెందిన 'యువ సొసైటీ' అనే సంస్థ ఈ టోర్నీని నిర్వహించింది. నవంబర్ 8న ముగియాల్సిన ఈ లీగ్ ఆదివారం నాటికే అర్ధాంతరంగా ముగిసిపోయింది.చెల్లింపులు లేక ఆటగాళ్ల ఆగ్రహం హెూటల్ బిల్లులు, ఆటగాళ్ల పేమెంట్లు ఇవ్వకపోవడంతో వివాదం ముదిరింది. నిర్వాహకులు చెల్లింపులు చేయకుండానే వెళ్లిపోయారని హెూటల్ సిబ్బంది తెలిపారు. దీంతో విదేశీ ఆటగాళ్లు, అంపైర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ఇంగ్లండ్ అంపైర్ మెలిసా జునిపర్ మాట్లాడుతూ "ఒక్క రూపాయి కూడా మాకు చెల్లించలేదు. నిర్వాహకుల ఫోన్లు స్విచాఫ్ చేశారు" అని ఆరోపించారు.అధికారులు, రాజకీయ నేతల స్పందన ఈ ఘటనపై జమ్మూ కశ్మీర్ క్రీడా మండలి స్పందించేందుకు నిరాకరించింది. "మేము కేవలం వేదిక మాత్రమే ఇచ్చాము, టోర్నీ నిర్వహణలో మాకు ఎలాంటి ప్రమేయం లేదు" అని స్పష్టం చేసింది. అయితే ఈ ఘటనతో రాష్ట్రానికి చెడ్డపేరు తెచ్చారని జమ్మూ కశ్మీర్ బీజేపీ మండిపడింది.క్రీడా రంగంలో పారదర్శకతను కాపాడాలని, ఇలాంటి మోసపూరిత సంఘటనలను ఖండిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## చెన్నైకి షాక్ నెహ్రా నిర్ణయం మారింది...




**-వాషింగ్టన్ కోసం సీఎస్కే ప్రయత్నాలు...**
**-ట్రేడ్‌ను తిరస్కరించిన ఆశిష్ నెహ్రా...**
**-ఐపీఎల్ 2026లో గుజరాత్ తరఫునే సుందర్...**

**ముంబై,** టీమిండియా స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను తమ జట్టులోకి తెచ్చుకోవాలని చెన్నై సూపర్‌కింగ్స్ తీవ్రంగా ప్రయత్నించినా, గుజరాత్ టైటాన్స్ మెంటార్ ఆశిష్ నెహ్రా మాత్రం ససేమిరా అన్నాడట. సుందర్‌ను వదిలే ఉద్దేశం లేదని గుజరాత్ యాజమాన్యం స్పష్టం చేసింది.ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌లో హెూబార్ట్ వేదికగా వాషింగ్టన్ సుందర్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. అదే సమయంలో ఐపీఎల్‌లో అతడిని చెన్నై సూపర్‌కింగ్స్ దక్కించుకునేందుకు ఆసక్తి చూపింది. "చెన్నైకి వస్తున్నాడు" అంటూ కొన్ని రోజుల క్రితం వచ్చిన రూమర్స్ నిజం కావచ్చని అప్పటివరకు అనుకున్నా, ఇప్పుడు ఆ అవకాశం పూర్తిగా లేకపోయినట్టే.సుందర్ కోసం చెన్నై ప్రయత్నాలు చేసినా, గుజరాత్ టైటాన్స్ హెడ్‌కోచ్ ఆశిష్ నెహ్రా ఆ ట్రేడ్ ప్రతిపాదనను పూర్తిగా తిరస్కరించాడని క్రిక్‌బజ్ పేర్కొంది. గుజరాత్ యాజమాన్యం సుందర్‌ను వదిలే ఉద్దేశం లేదని చెన్నైకి ముందుగానే తెలిపిందట. ఈ నిర్ణయం సుందర్ ఆస్ట్రేలియాపై హెూబార్ట్‌లో చేసిన అద్భుత ఇన్నింగ్స్‌కి ముందే తీసుకున్నదని సమాచారం.ఆ మ్యాచ్‌లో సుందర్ బ్యాటింగ్ చూసిన తర్వాత గుజరాత్ మేనేజ్‌మెంట్ అతడిని వదిలేయకూడదని నిర్ణయించుకుందట. పవర్‌ప్లేలో బౌలింగ్ చేయగలడు, చివర్లో బ్యాటింగ్‌లో దూకుడుగా రాణించగలడు అనే నమ్మకం నెహ్రాకు ఉంది. అందుకే సుందర్‌ను వదులుకోవడంపై వెనకడుగు వేసాడు.వాషింగ్టన్ సుందర్‌ను గుజరాత్ టైటాన్స్ చివరి మెగా వేలంలో రూ.3.2 కోట్లకు కొనుగోలు చేసింది. అప్పటి నుంచి అతని కెరీర్ వేగంగా ఎదిగింది. గత సీజన్‌లో కేవలం ఆరు మ్యాచ్‌లు మాత్రమే ఆడినా, వాటిలో గుర్తుండిపోయే ప్రదర్శనలిచ్చాడు. 49 పరుగులు హైయెస్ట్ స్కోర్‌గా నమోదు చేసుకున్న సుందర్ మొత్తం 133 పరుగులు 166 స్ట్రైక్ రేట్‌తో చేశాడు.ఐపీఎల్ 2025లో గుజరాత్ తరఫున కీలక పాత్ర పోషించిన సుందర్, ప్రస్తుతం టీమిండియా జట్టులో అన్ని ఫార్మాట్లలో స్థానం దక్కించుకున్నాడు. బౌలింగ్, బ్యాటింగ్ రెండింటిలోనూ రాణిస్తూ నిజమైన ఆల్‌రౌండర్‌గా ఎదిగాడు. ముఖ్యంగా టెస్టు క్రికెట్‌లో రవీంద్ర జడేజాతో పాటు మరో కీలక స్పిన్ ఆల్‌రౌండర్‌గా స్థానం సంపాదించాడు.

## 'వరల్డ్ కప్ రన్నరప్‌గా నిలిస్తే రూ.8 వేలు'




**ముంబై,** భారత మహిళా క్రికెట్ జట్టు వన్డే వరల్డ్ కప్ గెలిచి చరిత్ర సృష్టించింది. ఈ విజయం మహిళా క్రికెట్‌కు బీసీసీఐ నుంచి రూ. 51 కోట్ల నజరానా, ఐసీసీ నుంచి రూ. 39 కోట్ల ప్రైజ్‌మనీని తెచ్చిపెట్టింది. 2005లో రన్నరప్‌గా నిలిచినప్పుడు కేవలం రూ. 8 వేలు మాత్రమే అందుకున్న మహిళా క్రికెటర్ల పరిస్థితిని మిథాలీ రాజ్ గుర్తుచేసుకున్నారు. జై షా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మహిళా క్రికెట్‌లో గణనీయమైన మార్పులు వచ్చాయి.మహిళల వన్డే వరల్డ్ కప్ చరిత్రలో టీమిండియా ప్రభంజనం సృష్టించింది. ఎన్నో దశాబ్దాలుగా అందని ద్రాక్షలా మారిన వరల్డ్‌కప్ ట్రోఫీని హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు ఒడిసి పట్టుకుంది. ఈ ట్రోఫీతో భారత మహిళా క్రికెట్ ముఖపటం మొత్తం మారిపోయింది. వరల్డ్ కప్ విజేతగా నిలిచిన జట్టుకు బీసీసీఐ ఏకంగా రూ. 51 కోట్ల నజరానా ప్రకటించింది. ఇది కాకుండా వరల్డ్ కప్ విజేతకు ఐసీసీ రూ. 39 కోట్ల ప్రైజ్‌మనీ అందించింది. దాంతో మొత్తం టీమిండియా మహిళా జట్టుకు రూ. 90 కోట్ల నగదు అందినట్లయింది!కానీ.. ఇరవై ఏళ్ల కిందట భారత మహిళా జట్టు పరిస్థితి ఎంత దారుణంగా ఉండేదో మాటల్లో చెప్పలేం. 2005 మహిళల వన్డే వరల్డ్ కప్‌లో టీమిండియా రన్నరప్‌గా నిలిచింది. ఆస్ట్రేలియా చేతిలో భారత మహిళా జట్టు ఓటమిపాలయింది. ఆ సమయంలో భారత మహిళా క్రికెట్ ప్లేయర్లకు బోర్డు అందించిన వేతనం ఎంతో తెలిస్తా షాక్ అవుతారు. మ్యాచ్‌కి రూ. వెయ్యి చొప్పున, ఎనిమిది మ్యాచ్‌లకు రూ. 8 వేలు మాత్రమే ఇచ్చారట! ఇది నేరుగా లేడీ టెండూల్కర్‌గా పిలిచే, టీమిండియా ఉమెన్స్ లెజండ్రీ క్రికెటర్ మిథాలీ రాజ్ చెప్పిన విషయం.టీమిండియా మహిళా క్రికెటర్ల ప్రైజ్‌మనీ, వేతనాలు విషయం ఇప్పుడు ప్రస్తావనకు వస్తున్న సమయంలో మిథాలీ రాజ్ పాత వీడియో ఒకటి వైరల్ అవుతోంది. మహిళా క్రికెటర్లు బీసీసీఐ అధీనంలోకి రాకముందు వారు పొందిన తక్కువ పారితోషికం గురించి ఆ వీడియోలో చెప్పింది. జైషా బీసీసీఐ ఛైర్మన్ అయిన తర్వాత మహిళల క్రికెట్ ఎలా మెరుగుపడిందో వివరించింది.మిథాలీ లల్లన్‌టాప్‌తో మాట్లాడుతుండగా "ఆ సమయంలో ఎలాంటి వార్షిక కాంట్రాక్ట్ ఉండేది కాదు. బీసీసీఐ అధీనంలోకి వచ్చిన తర్వాతే కాంట్రాక్టులు ప్రారంభమయ్యాయి. మ్యాచ్ ఫీజు కూడా ఏదీ ఉండేది కాదు. నేను తప్పు చెబుతుంటే మన్నించాలి కానీ, 2005లో మనం రన్నరప్‌గా నిలిచినప్పుడు, ఒక్క మ్యాచ్‌కు కేవలం రూ. 1000 చొప్పున ఇచ్చారు. మొత్తం ఎనిమిది మ్యాచ్‌లు ఆడాం. అంటే మొత్తం రూ. 8,000 మాత్రమే. అప్పట్లో ఈ క్రీడలో డబ్బు అన్నది అసలు లేదు. బీసీసీఐ చేతుల్లోకి వచ్చిన తర్వాతే సిరీస్ ఫీజులు, మ్యాచ్ ఫీజులు ప్రారంభమయ్యాయి. ఇటీవలే సమాన వేతన విధానం అమల్లోకి వచ్చింది" అని ఆమె గుర్తుచేసుకుంది.2019 - 2024 మధ్య కాలంలో జై షా బీసీసీఐ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. జైషా ఆ పగ్గాలు చేపట్టిన వెంటనే భారత క్రికెట్ ముఖచిత్రం మొత్తం మారిపోయింది. ముఖ్యంగా మహిళా క్రికెట్‌పై దృష్టి సారించి పురుషులతో సమానంగా వారికి కూడా అన్నీ అందేలా చేశారు. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ ప్రారంభించడమే కాకుండా, బీసీసీఐ తరఫున ఆడుతున్న ప్రతి క్రికెటర్‌కి లింగ భేదం లేకుండా సమాన వేతన విధానం అమలు చేసి ఒక చారిత్రాత్మక మార్పు తీసుకొచ్చారు జై షా సహకారంతోనే ఇవాళ భారత మహిళా క్రికెట్ జట్టు వరల్డ్ కప్ విజేతగా నిలిచింది అని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. బీసీసీఐ నుంచి ఐసీసీకి వెళ్లిన తర్వాత మరో విప్లవాత్మక దిశగా అడుగులు వేసి, మహిళా వన్డే వరల్డ్ కప్ ప్రైజ్‌మనీని పురుషుల కంటే ఏమాత్రం తీసిపోకుండా ప్రకటించారు. గతంలో మహిళలకు ఇచ్చిన ప్రైజ్‌మనీ కంటే ఏకంగా 297 శాతం పెంచి ఉమెన్స్ క్రికెట్‌ను ప్రోత్సహించారు.

## వన్డే కప్ తర్వాత జెమీమా బ్రాండ్ వాల్యూ దూసుకెళ్లింది




**ముంబై,** భారత మహిళా జట్టు వన్డే ప్రపంచకప్ విజయంతో దేశవ్యాప్తంగా సంబరాలు నిండిపోయాయి. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కలను నెరవేర్చిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం భారత క్రీడా చరిత్రలో స్వర్ణాక్షరాలతో నిలిచిపోయింది. ఈ విజయం కేవలం ట్రోఫీ వరకే పరిమితం కాలేదు. జట్టులోని ఆటగాళ్లకు కొత్త గుర్తింపు, కొత్త గౌరవం, కొత్త ఆదాయం తెచ్చిపెట్టింది.ప్రపంచకప్ గెలుపుతో మహిళా క్రికెటర్ల క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, షఫాలి వర్మ, దీప్తి శర్మ వంటి ఆటగాళ్ల సోషల్ మీడియా ఫాలోవర్లు రెట్టింపయ్యారు. అదే సమయంలో వారి బ్రాండ్ విలువలు కూడా విపరీతంగా పెరిగాయి. క్రికెటర్లకు లభించే బ్రాండ్ ప్రమోషన్ ఫీజులు 25 శాతం నుంచి 100 శాతం వరకు పెరిగినట్లు మార్కెట్ విశ్లేషకులు తెలిపారు.ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన జెమీమా రోడ్రిగ్స్ ప్రస్తుతం మహిళా క్రికెటర్లలో అత్యధికంగా దృష్టిని ఆకర్షిస్తోంది. ఆమె బ్రాండ్ విలువ 100 శాతం పెరిగినట్లు సమాచారం. అంతకుముందు జెమీమా ఒక్కో బ్రాండ్ ప్రచారానికి రూ.75 లక్షలు తీసుకుంటుండగా, ఇప్పుడు అది రూ.1.5 కోట్లకు పెరిగిందని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. ప్రపంచకప్ అనంతరం దాదాపు 10కి పైగా కొత్త బ్రాండ్‌లు ఆమెను సంప్రదించాయని జేఎస్‌డబ్ల్యూ కమర్షియల్ విభాగం అధికారి కరణ్ యాదవ్ తెలిపారు.ఇక దేశంలో అత్యధిక పారితోషికం పొందుతున్న మహిళా క్రికెటర్ స్మృతి మంధాన ఇప్పటికే నైక్, హెర్బాలైఫ్, హ్యుందయ్, ఎస్బీఐ, గల్ఫ్ ఆయిల్, రెక్సోనా, పీఎన్‌బీ మెట్‌లైఫ్ ఇన్సూరెన్స్ వంటి దాదాపు 16 బ్రాండ్‌లకు ప్రచారకర్తగా ఉన్నారు. ఒక్కో బ్రాండ్ కోసం ఆమె రూ.1.5 నుంచి 2 కోట్ల వరకు పారితోషికం పొందుతున్నట్లు సమాచారం.వన్డే కప్ విజయం తర్వాత మహిళా క్రికెటర్లు ఇప్పుడు కేవలం క్రీడా రంగానికే పరిమితం కాకుండా బ్రాండ్ ప్రపంచంలోనూ కొత్త చరిత్ర సృష్టిస్తున్నారు.

## సంక్రాంతి సందడి రెట్టింపు చేసేందుకు "రాజా సాబ్"






**హైదరాబాద్,** పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ హీరోగా నటిస్తోన్న చిత్రాల్లో రాజాసాబ్ ఒకటి. డైరెక్టర్ మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ హారర్ మూవీ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రభాస్ కెరీర్ లో ఫస్ట్ టైమ్ హారర్ కామెడీ డ్రామాగా రాబోతున్న ఈ సినిమా కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు.రెబల్ స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి, ప్రెస్టీజియస్ ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్ లో రూపొందుతున్న క్రేజీ మూవీ "రాజా సాబ్" వచ్చే సంక్రాంతికి జనవరి 9న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమా విడుదల తేదీ మరోసారి వాయిదా పడిందంటూ ఇటీవల సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ ప్రచారమవుతోంది. ఈ అసత్య ప్రచారనికి చెక్ పెట్టారు మూవీ టీమ్. అనుకున్న ప్రకారమే జనవరి 9న "రాజా సాబ్" సినిమా ఘనంగా ప్రేక్షకుల ముందుకు రాబోతుందని వెల్లడించారు.23ఏళ్లకే రూ. 250 కోట్లకు పైగా ఆస్తులు..ఈ సీరియల్ బ్యూటీ మామూల్ది కాదు భయ్యా..!ప్రస్తుతం "రాజా సాబ్" సినిమాకు సంబంధించిన వీఎఫ్ఎక్స్, ఇతర పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఫుల్ స్వింగ్ లో జరుగుతున్నాయి. జనవరి 9న అన్ని భాషల్లో విడుదల చేసేందుకు రిలీజ్ సన్నాహాలు కూడా చేస్తున్నారు. ఐమ్యాక్స్ వెర్షన్ సహా అన్ని లార్జర్ ఫార్మేట్స్ లో "రాజా సాబ్" ప్రేక్షకుల ముందుకు రానుంది. డిసెంబర్ లో యూఎస్ లో గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ జరపనున్నారు. డిసెంబర్ 25వ తేదీలోగా ఫస్ట్ కాపీ రెడీ చేయబోతున్నారు. ఇలా అన్ని హంగులతో సంక్రాంతి సందడి రెట్టింపు చేసేందుకు "రాజా సాబ్" థియేటర్స్ లో అడుగుపెట్టేందుకు సన్నద్ధమవుతున్నాడు.అప్పుడు మెగాస్టార్ సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్.. ఇప్పుడు క్రేజీ హీరోయిన్..టాలీవుడ్ నుంచి వస్తున్న మరో ప్రెస్టీజియస్ మూవీగా "రాజా సాబ్" ను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు మారుతి. ఈ సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో అన్ కాంప్రమైజ్డ్ గా నిర్మిస్తున్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్స్ గా నటిస్తున్నారు.

## కేతికను పట్టించుకోని దర్శకనిర్మాతలు



**హైదరాబాద్,**సినిమా ఇండస్ట్రీలో చాలా మంది హీరోయిన్స్ కు సంబందించిన చైల్డ్ హుడ్ ఫోటోలు నిత్యం వైరల్ అవుతున్నాయి. అలాగే పైన కనిపిస్తున్న భామ ఎవరో గుర్తుపట్టారా.? ఆమె మరెవరో కాదు హాట్ బ్యూటీ కేతిక శర్మ. కేతిక శర్మ 2021లో విడుదలైన రొమాంటిక్ సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది. సినిమా ఇండస్ట్రీలో చాలా మంది హీరోయిన్స్ కు సంబందించిన చైల్డ్ హుడ్ ఫోటోలు నిత్యం వైరల్ అవుతున్నాయి. అలాగే పైన కనిపిస్తున్న భామ ఎవరో గుర్తుపట్టారా.? ఆమె మరెవరో కాదు హాట్ బ్యూటీ కేతిక శర్మ. కేతిక శర్మ 2021లో విడుదలైన రొమాంటిక్ సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది. ఆకాష్ పూరి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. ఆతర్వాత లక్ష్య అనే సినిమా చేసింది కానీ ఈ సినిమా ఫ్లాప్ అయ్యింది. వైష్ణవ్ తేజ్ తో రంగ రంగ వైభవంగా, అలాగే పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ హీరోగా నటించిన బ్రో సినిమాలో చేసింది. కానీ ఆ సినిమా కూడా అంతగా ఆకట్టుకోలేకపోయింది.మొన్నామధ్య సింగిల్ అనే సినిమా చేసింది. శ్రీవిష్ణు హీరోగా నటించిన సింగిల్ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమాతో కేతిక అకౌంట్ లో మొదటి హిట్ పడింది. కానీ ఈ అమ్మడి ఆతర్వాత ఆశించిన స్థాయిలో అవకాశాలు మాత్రం రావడం లేదు. అందంతో కవ్విస్తున్నా ఈ చిన్నదానికి మాత్రం ఆఫర్స్ రావడం లేదు.. ఇప్పుడు ఈ అమ్మడు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటుంది. ప్రస్తుతం కేతిక చేతిలో సినిమాలు ఏవి లేవు. కానీ సోషల్ మీడియాలో ఈ ముద్దుగుమ్మ ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఈ అమ్మడి ఫోటోలకు మంచి క్రేజ్ ఉంది. రెగ్యులర్ గా క్రేజీ ఫోటోలు, హాట్ హాట్ పిక్స్ షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఇక తన అందాలతో కుర్రాళ్లకు మత్తెక్కిస్తోంది ఈ ముద్దుగుమ్మ. కేతిక క్రేజీ ఫోటోలకు అభిమానులు, నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.

## మహేష్ బాబు బాటలో రామ్ చరణ్...





**హైదరాబాద్,**మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, గ్లామర్ క్వీన్ జాన్వీ కపూర్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవెయిటెడ్ విలేజ్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'ఉప్పెన' ఫేం బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రం చరణ్ కెరీర్‌లోనే మరో మాసివ్ ప్రాజెక్ట్‌గా నిలవనుందని ట్రేడ్ సర్కిల్స్ చెబుతున్నాయి. ఇప్పటికే మూవీ ఫస్ట్ గ్లింప్స్‌తోనే ఫ్యాన్స్‌లో హైప్ పెరిగిపోయింది. ఇప్పుడు సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. 'పెద్ది' చిత్రానికి సంగీతం అందిస్తున్న ఆస్కార్ విన్నర్, మ్యూజిక్ లెజెండ్ ఏఆర్ రెహమాన్ తాజాగా ఫస్ట్ సింగిల్‌పై హింట్ ఇచ్చారు. రామ్ చరణ్ తన సోషల్ మీడియాలో "ఏం ప్లాన్ చేస్తున్నారు?" అంటూ రెహమాన్, బుచ్చిబాబు, మోహిత్ చౌహాన్ ఉన్న ఫోటోను షేర్ చేశారు.దానికి స్పందించిన రెహమాన్ సరదాగా "చికిరి చికిరి చరణ్ గారు!" అంటూ రిప్లై ఇచ్చారు. ఈ వ్యాఖ్యలతో ఫ్యాన్స్‌లో ఉత్సాహం పెరిగింది. ఫస్ట్ సింగిల్ వర్క్ ఫైనల్ స్టేజ్‌లో ఉందని, త్వరలోనే విడుదల చేయనున్నారని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ చర్చ నెట్టింట వైరల్‌గా మారింది. రెండు రోజుల క్రితం మహేష్ బాబు రాజమౌళి కాంబినేషన్ 'SSMB29' టీమ్ కూడా ఇలాగే సోషల్ మీడియాలో సరదాగా చాట్ చేసిన సంగతి తెలిసిందే. అదే తరహాలో ఇప్పుడు 'పెద్ది' టీమ్ కూడా హంగామా సృష్టిస్తోంది.పెద్ది సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతుండగా, ఇటీవల శ్రీలంకలో కీలక షెడ్యూల్ పూర్తి చేశారు. చరణ్ జాన్వీ జంటపై ఒక లవ్ రొమాంటిక్ సాంగ్ చిత్రీకరించినట్లు టాక్.ఫ్యాన్స్ అంచనాల ప్రకారం, ఈ పాటను ఈ నెల 8న హైదరాబాద్‌లో జరగనున్న ఏఆర్ రెహమాన్ స్పెషల్ ఈవెంట్‌లో విడుదల చేసే అవకాశం ఉంది. గ్లింప్స్‌లోనే "పెద్ది పెద్ది పెద్ది" అంటూ రెహమాన్ మ్యూజిక్ హైప్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆయన చెప్పిన "చికిరి చికిరి" లైన్ ఆ ఫస్ట్ సింగిల్‌లో కీలక భాగమని అభిమానులు ఊహిస్తున్నారు. ఇటీవల మేకర్స్ హీరోయిన్ పాత్రను రివీల్ చేశారు. జాన్వీ సినిమాలో 'అచ్చియమ్మ' అనే పాత్రలో కనిపించనున్నారు. ఇది జానపద గాయని పాత్రగా, గ్రామీణ నేపథ్యంతో కూడిన మాసీ రోల్ అని తెలుస్తోంది. ఇప్పటివరకు గ్లామరస్ లుక్స్‌తోనే కనిపించిన జాన్వీకి ఇది కెరీర్‌లో కొత్త మలుపుగా మారవచ్చని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ చిత్రంలో శివరాజ్ కుమార్, మీర్జాపూర్ ఫేం దివ్యేందు శర్మ, జగపతిబాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాను మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో, వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై సతీష్ వెంకట కిలారు నిర్మిస్తున్నారు. 'పెద్ది'ను 2026 మార్చి 27న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు సమాచారం.

## షర్ట్ లేకుండా సల్మాన్ ఖాన్...





**హైదరాబాద్,** బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ తాజాగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన షర్ట్ లేని ఫొటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. 59 ఏళ్ల వయసులో కూడా ఆయన కండలు, సిక్స్ ప్యాక్ ప్రదర్శిస్తూ కనిపించడంతో అభిమానులు షాక్‌కి గురవుతున్నారు. సల్మాన్ ఖాన్ తన అద్భుతమైన ఫిజిక్‌ను చూపిస్తూ షేర్ చేసిన ఈ ఫొటోలకు కామెంట్ల వర్షం కురుస్తుంది. ముఖ్యంగా ఆయన నటించిన బ్లాక్‌బస్టర్ సినిమాను గుర్తు చేస్తూ అభిమానులు టైగర్ జిందా హై అని ట్రెండింగ్ చేస్తున్నారు. మరోవైపు ఇండియాకు ఫిట్‌నెస్ ఐకాన్ సల్మాన్ అంటూ పొగడ్తలతో ముంచెత్తారు.సల్మాన్ ఖాన్ తన రాబోయే చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గాల్వన్' కోసం సిద్ధమవుతున్నట్లు ఈ ఫొటోలు చూస్తే అర్థమవుతుంది. అయితే ఈ ఫొటోలకి సల్మాన్ రాసుకోస్తూ.. "కొన్ని సాధించాలంటే మరికొన్ని వదులుకోవాలి కానీ ఇది వదులుకోకుండానే వచ్చింది" అనే క్యాప్షన్‌ని జోడించాడు.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com